



ఫ్లాట్ ఫారాలన్నీ నిండిపోయిన ఉల్లి నిల్వలు

రవాణా ఖర్చులు కూడా రాని పరిస్థితి

ఒకటిన్నర ఎకరాలో ఉల్లి పంటను రూ.లక్ష ఖర్చుతో సాగు చేశాను. అయితే.. కర్నూలు యార్డులో పరిస్థితిని చూస్తే క్వింటానికి గరిష్ఠ ధర రూ.వెయ్యి కూడా అందే అవకాశం లేదు. గత సంవత్సరం ఇదే సమయానికి కర్నూలు యార్డులో క్వింటా ఉల్లి రూ.4వేలకు అమ్మాను. రూ.3 లక్షల ఆదాయం వచ్చింది. ఈసారి క్వింటా రూ.వెయ్యి కూడా వచ్చే పరిస్థితి లేదు. లారీ ఖర్చు కూడా అందుతుందో లేదో.

\- చంద్రయ్య, పెనుమాడ, క్రిష్ణగిరి మండలం

మళ్లీ ఉల్లి పతనం

- తీవ్ర సంక్షోభంలో ఉల్లి రైతాంగం
- ప్రస్తుత ఖరీఫ్‌లో 50వేల ఎకరాల్లో సాగు
- వెంటాడుతున్న వర్షం.. పొలాల్లోనే కుళ్లిపోతున్న పంట
- యార్డుల్లో అన్నదాతల జాగరణ

కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఈ సంవత్సరం ఖరీఫ్‌లో వర్షాలు ముందుగానే పడటంతో రైతులు మే నెల నుంచే ఉల్లి సాగును ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలో 50వేల ఎకరాల దాకా ఈసారి ఉల్లి పంట సాగు చేశారు. ఓ వైపు వర్షాలు, ఇంకో వైపు ధర పతనం కావడంతో రైతులు మార్కెట్ యార్డులో కన్నీరు మున్నీరవుతున్నారు. గురువారం కర్నూలు మార్కెట్ యార్డుకు 8వేల క్వింటాళ్ల ఉల్లిని రైతులు అమ్మకానికి తెచ్చారు. గత నాలుగు రోజుల నుంచి కూడా ఉల్లి అమ్మకాలు లేక కొంత మంది రైతులు యార్డులోనే జాగరణ చేస్తున్నారు. ఉల్లిగడ్డలు తేమ పట్టి ఉండటంతో ఎక్కువ ధరను చెల్లించేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. నాలుగు రోజులుగా పరిశీలిస్తే క్వింటా ఉల్లి ధర గరిష్ఠంగా రూ.వెయ్యి, కనిష్ఠ ధర రూ.500కు మాత్రమే అమ్ముడుపోతుంది. దీంతో కనీసం రవాణా ఖర్చులు కూడా గిట్టుబాటు కాని పరిస్థితి. కొంత మంది రైతులు మార్కెట్ యార్డుకు తీసుకెళ్లి ఇబ్బందులు పడుతుంటే.. మరికొందరు రైతులు పొలంలోనే ఉల్లిని పశువులకు మేతగా వదిలేస్తున్నారు. గతేడాది ఇదే సమయానికి కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి ధర క్వింటా రూ.4వేలకు పైగా పలికింది. కానీ ఇప్పుడు మాత్రం రూ.వెయ్యికి కూడా కొనేవారు కరువయ్యారు. అమ్మకానికి ఉల్లి దిగుబడులు అధికంగా రావడంతో పాటు వరుస వర్షాలతో రైతులను మరింత కుదిపేస్తున్నాయి. చేతికొచ్చిన ఉల్లి పొలాల్లోనే కుళ్లిపోతుండటంతో ఆ రైతులు దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితులను ఎదుర్కొనేందుకు అధికారులకు దిక్కుతోచని పరిస్థితి ఎదురు కావడంతో వారు మంత్రులకు నివేదించారు.

ఎమ్మెల్యేలు, మంత్రులు రెండు రోజుల క్రితం సీఎం చంద్రబాబునాయుడును కలిసి ఉల్లి రైతుల దయనీయ స్థితిని తెలియజేశారు. దీంతో సీఎం చంద్రబాబు మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీతను పిలిపించి ఉమ్మడి జిల్లాలో ఉల్లి రైతులను ఆదుకునేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గురువారం డైరెక్టర్ ఆదేశాలపై మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు, డిప్యూటీ డైరెక్టర్ లావణ్య, కడప నుంచి కర్నూలు యార్డుకు వచ్చి రైతుల పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు సూపర్‌వైజర్లతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదికను అందజేస్తామని, రైతులను ఆదుకుంటామని జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు ప్రకటించారు.

మిగతా 7వ పేజీలో




ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు శ్రీనివాసులు. కల్లూరు మండలంలోని బస్తిపాడు గ్రామంలో ఎకరా పొలంలో రూ.లక్షలతో ఉల్లి పంట సాగు చేశాడు. 112 సంచుల ఉల్లి దిగుబడి వచ్చింది. నాలుగు రోజుల క్రితం ఈ ఉల్లిని అమ్మకానికి కర్నూలు యార్డుకు తీసుకువచ్చారు. ఇప్పటి దాకా కొనుగోలు లేక రైతు యార్డులోనే జాగరణ చేస్తున్నాడు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని వందలాది మంది రైతులు ఇలా మార్కెట్ యార్డులోనే కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు.



జైజై గణేశా..!

- ఘనంగా ఆరంభమైన నవరాత్రి వేడుకలు
- వాడవాడలా కొలువుదీరిన గణపయ్యలు



వివరాలు 6లో

ఆదోని పట్టణం హనుమాన్ నగర్‌లోని రాజరాజేశ్వర్ కాలనీలో ఛత్రపతి శివాజీ మహరాజ్ గణపతి



మద్దికెర పట్టణంలో ముస్లింలు ఏర్పాటు చేసిన గణనాథుడు

ఎస్‌ఐకి ఏడేళ్ల జైలు

- రూ.2 లక్షలు జరిమానా విధిస్తూ కర్నూలు ఏసీబీ కోర్టు తీర్పు

కర్నూలు లీగల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వరకట్నం కేసులో ఓ వ్యక్తి నుంచి లంచం తీసుకుంటూ పట్టుబడిన కర్నూలు మహిళా పోలీస్ స్టేషన్ అప్పటి ఎస్‌ఐ బి.పెద్దయ్యకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.2.5 లక్షలు భారీ జరిమానా ఏసీబీ కోర్టు న్యాయాధికారి శ్రీవిద్య గురువారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. విశాఖపట్టణానికి చెందిన ఎన్.మంగరాజుపై కర్నూలు మహిళా పోలీస్ స్టేషన్‌లో వరకట్నం కేసు నమోదైంది. ఈ కేసులో అతడితో పాటు అతడి కుటుంబ సభ్యులను అరెస్టు చేయకుండా, కేసును నీరు గార్చేందుకు అప్పటి ఎస్‌ఐ బి.పెద్దయ్య రూ.లక్ష లంచంగా డిమాండ్ చేశారు. దీంతో మంగరాజు కర్నూలు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. 2015 ఏప్రిల్ 8వ తేదీన ఎస్‌ఐ బి.పెద్దయ్య రూ.లక్ష తన కార్యాలయంలోనే లంచం తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఆ తర్వాత పోలీసులు బి.పెద్దయ్యతో పాటు కానిస్టేబుల్ ఇండ్ల కిషోర్ కుమార్‌పై కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. కోర్టులో ఎస్‌ఐ బి.పెద్దయ్యపై మాత్రమే నేరం రుజువు కావడంతో ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు వివిధ సెక్షన్ల కింద రూ.2.5 లక్షలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. జరిమానా మొత్తంలో రూ.2 లక్షలను మంగరాజుకు చెల్లించాల్సిందిగా కోర్టు తన తీర్పు ఇచ్చారు. ఈ కేసులో కానిస్టేబుల్ కిషోర్ కుమార్‌పై నేరం రుజువు కాకపోవడంతో ఆయనపై కేసు కొట్టివేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ భగవాన్ రెడ్డి వాదించారు.

డీఎస్సీని పారదర్శకంగా నిర్వహించాం

- మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీని పారదర్శకంగా నిర్వహించి 16,347 పోస్టులను భర్తీ చేశామని పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గురువారం తన కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. ఏటా డీఎస్సీ నిర్వహించి యువ ఉపాధ్యాయులతో విద్యారంగాన్ని దేశంలోనే తొలి స్థానంలో నిలబెడతామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ఈడబ్ల్యూఎస్, దివ్యాంగులకు వయస్సు మినహాయింపు ఇచ్చి వారికి అండగా నిలబడ్డామన్నారు. యువత బాగుండటం ఇష్టంలేక రాష్ట్రంలోని ఓ ప్రధాన పార్టీ నేత మెగా డీఎస్సీని ఆపడానికి కేసులు వేయించారని చెప్పారు. వాటన్నింటినీ ఎదుర్కొని డీఎస్సీ ప్రక్రియను పూర్తి చేసిన ఘనత మంత్రి నారా లోకేశ్‌కు దక్కుతుందన్నారు. ప్రభుత్వ విద్యలో విద్యా ప్రమాణాలను మెరుగు పర్చేందుకు గత 14 నెలలుగా సమర్థవంతంగా సంస్కరణలు అమలు చేస్తూ పాఠశాలలకు నూతన వెలుగులు తెస్తున్నామన్నారు. 2014-2019 మధ్య రెండుసార్లు డీఎస్సీ నిర్వహించి 18వేల ఉపాధ్యాయ పోస్టులను అప్పటి టీడీపీ ప్రభుత్వం భర్తీ చేసిందని గుర్తుచేశారు. ప్రస్తుతం సమగ్ర శిక్ష సొసైటీ ఆధ్వర్యంలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న 729 నాన్ టీచింగ్ స్టాఫ్ పోస్టులను భర్తీ చేసిందన్నారు. 90 మంది ఎస్టీ యువతను కొత్తగా ఉపాధ్యాయులుగా నియమించిందని, 700 కోయభారతి టీచర్ పోస్టులు భర్తీ చేశామన్నారు. జూనియర్ కళాశాల్లో 700 మంది సిబ్బంది సేవలను, 476 ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో 3,619 మంది కాంట్రాక్టు లెక్చరర్ల సేవలను పునరుద్ధరణ చేశామని చెప్పారు. టీచర్లపై పని ఒత్తిడి తగ్గించేందుకు గత ప్రభుత్వంలో ఆరు రకాల బడుల విధానం ఉండగా .. తమ కూటమి ప్రభుత్వం వాటిని తొమ్మిది రకాల బడులుగా మార్చిందన్నారు. తమ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యా వ్యవస్థను గొప్పగా తీర్చి దిద్దేందుకు అన్ని విధాల కృషి చేస్తున్నామన్నారు.



‘పవర్‌గ్రిడ్’కు సహకరించండి

- పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్
- భూములు ఇచ్చేది లేదని తేల్చిచెప్పిన మనెకుర్తి రైతులు



ఆలూరు మండలం మనెకుర్తిలో ఆర్డీవో భరత్‌నాయక్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

ఆలూరు రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పవర్ గ్రిడ్ ప్రాజెక్టు ఏర్పాటుకు భూములు ఇచ్చి సహకరించాలని పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్ రైతులను విజ్ఞప్తి చేశారు. ఆలూరు మండలం మనెకుర్తి గ్రామంలో గురువారం పవర్ గ్రిడ్ ప్రాజెక్టుకు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం భారీ పోలీస్ బందోబస్తు మధ్య చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా ప్రయోజనం కోసం పవర్ గ్రిడ్ ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. ఎకరాకు రూ.18 లక్షలు ఇస్తుందని, భూములు ఇవ్వలేని పక్షంలో జనరల్ యాక్టు కింద పరిహారం ఇస్తారని ఆర్డీఓ చెప్పడంతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మనెకుర్తి గ్రామ రైతులు వెంకటేష్, నాగరాజు, కృష్ణ, దేవేంద్ర మాట్లాడుతూ కన్నతల్లి లాంటి సారవంతమైన భూములను పవర్‌గ్రిడ్ ప్రాజెక్టుకు భూములు ఇచ్చే ప్రసక్తే లేదన్నారు. పంట పొలాలపై ఆధారపడి జీవిస్తున్న తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నోటీసులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. పవర్ గ్రిడ్ ప్రాజెక్టుకు తమ భూములు ఇవ్వమని ఆర్డీఓతో రైతులు వినతిపత్రం అందించారు. సారవంతమైన భూములు కాకుండా ప్రాజెక్టు డీపీని మార్చి వేరే ప్రాంతాల్లో పవర్‌గ్రిడ్ ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని టీడీపీ రైతు కమిటీ రాష్ట్ర కార్యదర్శి నారాయణరెడ్డి అన్నారు. రైతులకు న్యాయం జరిగేలా అధికారులు చొరవ చూపాలన్నారు. రైతుల భూములను పవర్‌గ్రిడ్‌కు అప్పగిస్తే ఉద్యమం తప్పదని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు హనుమంతు, సీపీఐ జిల్లా నాయకుడు కాక భూపేష్ ఆర్డీఓ భరత్‌నాయక్‌కు వినతి పత్రం అందించారు. నాలుగు నెలలుగా రైతులకు సమాచారం ఇవ్వకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం 80 శాతం రైతులు ఒప్పుకుంటేనే భూసేకరణ చేయాలన్నారు. మనెకుర్తి, కమ్మరచేడు, హులేబీడు రైతుల జోలికి వస్తే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శోభసువర్ణమ్మ, సీఐ రవిశంకర్‌రెడ్డి, ఆర్‌ఐ బసవన్నగౌడ్, సర్పంచ్ కొల్లమ్మ, ఎస్‌ఐలు మహబూబ్ బాషా, దిలీప్‌కుమార్, మారుతి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

చంద్రబాబుతో రాష్ట్రం సుభిక్షం

‘కుడా’ చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు అర్బన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రం సుభిక్షంగా ఉటుందని ‘కుడా’ చైర్మన్ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తుందన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని జీర్ణించుకోలేని వైసీపీ తప్పుడు ప్రచారాలు చేస్తూ, పోలీస్ అధికారులకు హెచ్చరికలు చేయడాన్ని ప్రజలు అన్ని గమనిస్తున్నాన్నారు. ఓ చానల్‌ను అడ్డుపెట్టుకుని రాజధాని అమరావతిని చంద్రబాబు ముంచేశారని, ఫేక్ ప్రచారాలతో అభివృద్ధిని అడ్డుకునే కుట్రలు చేస్తున్నారని తెలిపారు. హంద్రీ నీవా పనులకు అతితక్కువ సమయంలో పూర్తి చేసి నీటిని మళ్లించి రైతులకు మేలు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం

- సర్వర్ మొరాయింపుతో అర్ధరాత్రి దాకా కొనసాగిన ప్రక్రియ
- ఇబ్బందులు పడిన డీఎస్సీ అభ్యర్థులు



7

ఎమ్మిగనూరులో వెండి గణపతి



ఎమ్మిగనూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణంలో ఏర్పాటు చేసిన ఓ వెండి వినాయకుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పట్టంలోని కోర్టు రోడ్డులో శక్తి వినాయక మండలి ఆధ్వర్యంలో నిర్వాహకులు వెండి వినాయకుడిని ఏర్పాటు చేశారు. రూ.60 లక్షల విలువైన 54 కిలోల వెండితో ఈ విగ్రహాన్ని చేయించారు. ఇందుకోసం 54 కిలోల వెండి కవచం, వెండి బిస్కెట్లు, చెంబులు, గ్లాసులను వినియోగించినట్లు నిర్వాహకులు శ్యామ్ తెలిపారు.

భళా.. బసవ..!

- రూ.5.05 లక్షల ధర పలికిన వృషభం

మంత్రాలయం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని సుంకేశ్వరి గ్రామానికి చెందిన దేవేంద్ర అనే రైతుకు చెందిన ఎద్దు రూ.5.05 లక్షల ధర పలికింది. గురువారం గ్రామంలో వినాయక చవితి సందర్భంగా బండలాగుడు పోటీల్లో నెగ్గిన ఆ ఎద్దును ఎమ్మిగనూరు మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన వెంకటయ్య అనే రైతు రూ.5.05 లక్షలకు కొనుగోలు చేశాడు. ఈ వృషభం ఆయా గ్రామాల ఉత్సవాల్లో జరిగే బండలాగుడు పోటీల్లో తిరుగులేని విజయాలను సాధిస్తుండడంతో భారీ రేటు పలికిందని రైతులు తెలిపారు.




కొనుగోలు చేసిన రైతు



వాడుక భాషకు గిడుగు తొలి అడుగు..!

● నేడు తెలుగు భాషా దినోత్సవం ● గిడుగు రామమూర్తి పంతులు జయంతి





కర్నూలు కల్చరల్/ఆత్మకూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆధునిక తెలుగు భాషకు పునాది వేసిన మహనీయుడు, కవి, గొప్ప సంఘ సంస్కర్త గిడుగు వెంకట రామమూర్తి. ఆయన జయంతిని పురస్కరించుకొని గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని జిల్లాలోని వివిధ సాహితీ, కళా సంస్థలు ఘనంగా నిర్వహించుకోనున్నాయి. ఈ సందర్భంగా తెలుగు భాషకు పట్టం కడుతూ విభిన్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తెలుగు భాష ప్రాముఖ్యత, సాంస్కృతిక వారసత్వాన్ని గుర్తు చేసేదే తెలుగు భాషా దినోత్సవం. అలాగే తెలుగును అధికారిక భాషగా, విద్యాబోధనలో వాడకాన్ని పెంచడానికి కృషి చేసే రోజే ఇది. జిల్లాలోనూ సాహిత్యం, కళారంగాల్లో తెలుగు భాషను సుసంపన్నం చేస్తూ ఎందరో కవులు, కవయిత్రులు, రచయితలు, రచయిత్రులు, రంగస్థల కళాకారులు, గాయకులు రాణిస్తున్నారు. తెలుగు భాషకు పెద్దపీట వేస్తూ తేనెలొలికే తెలుగు కమ్మదనాన్ని పదుగురికి పంచిపెడుతున్నారు. కథ, కథానిక, కవిత్వం, నాటకం, నవల, బాలసాహిత్యం తదితర అంశాల్లో తమదైన గుర్తింపుతో ముందుకు సాగుతున్నారు. తెలుగు భాషా దినోత్సవానికి ఆద్యుడు, వాడుక భాషోద్యమ నాయకుడు గిడుగు వెంకట రామమూర్తి బాటలో కొనసాగుతున్నామని చెబుతున్న వీరు తెలుగు భాష దినోత్సవం ఒక్కరోజు నిర్వహించుకునే ఒక వేడుక మాత్రమే కాదని, ఇది భాషాభివృద్ధికి, తెలుగు సంస్కృతి పరిరక్షణకు నిరంతరం కృషి చేయాలని స్ఫూర్తినిచ్చే రోజుని వారు అంటున్నారు.

బాల్యం నుంచీ తెలుగు భాషపై మమకారం పెరగాలి



మాట్లాడే ప్రాయం నుంచీ తెలుగు భాషపై మమకారం పెరిగేలా పిల్లలను పెంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. కానీ దురదృష్టవశాత్తు నేడు ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలనలు 'అమ్మా-నాన్న' అనిపించుకోవడానికి విముఖత చూపుతూ 'మమ్మీ-డాడీ' వంటి పాశ్చాత్య పదాలతో పిలిపించుకొని మురిసిపోతున్నారు. ఇక పాఠశాలల్లో కూడా తెలుగు మాధ్యమాలకు దూరంగానే చదువులు చెప్పిస్తున్నారు. మాతృభాషలో అర్థమయ్యేలా పరభాషలో అర్థం చేసుకోవడం చాలా కష్టం. చాలామంది గొప్ప గొప్ప వాళ్లంతా తమ చదువులు మాతృభాషలో కొనసాగించిన వారే. దాన్ని గుర్తించాలి. భాష అనేది ఒక భావప్రసారం లాంటిది. అది వ్యక్తుల మధ్య చక్కగా ఉంటేనే మంచి ప్రయోజనాలు ఉంటాయి. లేకపోతే భవిష్యత్తులో ఇబ్బందులే ఏర్పడతాయి. బాలలు సులువుగా తెలుగులో చదువుకునేందుకు 50కి పైగా పుస్తకాలు రాశాను. ఇందులో అనేక ప్రయోగాలతో కూడిన పుస్తకాలు మంచి ఫలితాలు ఇస్తున్నాయి.

- డాక్టర్ ఎం.హరికిరణ్, బాలల సాహిత్య రచయిత, కర్నూలు

తెలుగులో రచనలే నాకు గుర్తింపు తెచ్చాయి



తెలుగు భాషలో రాసిన కవిత్వమే నాకు మంచి గుర్తింపు తెచ్చి పెట్టింది. కవిత్వమే లేకుంటే నేను ఒక సాదాసీదా మహిళగా మిగిలిపోయేదాన్ని. అనేక సామాజిక అంశాలపై 200 కవితలు రాశాను. పూల నిప్పులు, వెన్నెల కురవని రాత్రి కవితా సంపుటిలు వెలువరించాను. వృత్తిరీత్యా నేను టైలరింగ్ మాస్టర్‌ను. ప్రవృత్తి పరంగా రచనా వ్యాసాంగం ఎంచుకున్నాను. నా పుస్తకాలు చదివిన కొలుకలూరి ఇనాక్, సినీ నటుడు తనికెళ్ల భరణి, కార్టూనిస్టు, రచయిత శ్రీరాం వంటి వారు ప్రశంసలు కురిపించారు. మన తెలుగు భాషను కాపాడుకోవడం ప్రతి ఒక్కరూ ఒక బాధ్యతగా స్వీకరించాలి. మన భాష దూరమైపోతే మన సంస్కృతిని మనం దూరం చేసుకున్నట్లే అవుతుంది.

- జె.స్వయంప్రభ, కవయిత్రి, ఎమ్మిగనూరు

భాషాభివృద్ధికి గిడుగు కృషి మరువలేనిది



తెలుగు వ్యావహారిక భాషా అభ్యున్నతికి గిడుగు రామ్మూర్తి చేసిన కృషి అమోఘం. ఒకప్పుడు ప్రాచీన సాహిత్యంతో కూడిన తెలుగు గ్రాంథిక భాష చాలామందికి అర్థమయ్యేది కాదు. ఈ ఇబ్బందులను గుర్తించిన గిడుగు రామ్మూర్తి అర్థం లేని భాష వ్యర్థం అన్న నానుడితో తెలుగు వ్యావహారిక భాషాభివృద్ధికి పూనుకున్నారు. తొలుత ఆ ప్రయత్నానికి అనేక ఇబ్బందులు ఎదురైనప్పటికీ చివరకు తెలుగు ప్రజలందరు వ్యావహారిక భాషపైనే మక్కువచూపారు. ప్రత్యేకించి నేటి ఆధునిక కవుల కవిత్వాలు శిఖరాగ్రస్థానానికి చేరుకోవడంలో గిడుగు పాత్ర ఎంతో కీలకం.

- డాక్టర్ సుజాత, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆత్మకూరు



తెలుగు పాటల్లో కమ్మదనం ఉంది



'ఇంటి పేరు గిడుగు... నీవంటే ఒక పిడుగు... జీవభాష కోసం నీ జీవితాన్ని ఇచ్చావు.. గిడుగు రామమూర్తి నీవే మా స్ఫూర్తి...' అంటూ ఆ మహనీయుడిని కీర్తించే అవకాశం నాకు పాట ద్వారా కలిగింది. మనం మాట్లాడే భాష, వాడుకలోని భాషను అధికారికంగా అమలు చేయాలని గిడుగు రామమూర్తి పంతులు చేసిన దశాబ్దాల పోరాటం ప్రతి తెలుగు వారూ గుర్తుంచుకోవాలి. లలితమైన తెలుగు భాషలో సలితమైన తెలుగు పాటలు కూడా పరిమళాలను వెదజల్లుతాయి. తెలుగు భాషలో నేను రాసిన పాటలు నాకు ఎంతో పేరు ప్రతిష్టలు తీసుకువచ్చాయి. ఇది కేవలం ఆ భాష మహిమే. ఆ భాష గొప్పదనమే. మనం ఇంగ్లీషులో ఎంత మాట్లాడినా, రాసినా ఒక ఆంగ్ల పాటను వినసొంపుగా వినగలమా..? అందుకే మన మాట, బాట, ఆశ, శ్వాస తెలుగే కావాలి.

- ఎలమర్తి రమణయ్య, కవి, పాటల రచయిత, కర్నూలు

తెలుగు భాషను విస్మరించడం దురదృష్టకరం



నేటి సమాజంలో తెలుగు భాషను విస్మరించడం దురదృష్టకరం. దేశ భాషలెందు తెలుగు లెస్స అంటూ విజయనగర సామ్రాజ్యాధిపతి శ్రీకృష్ణదేవరాయలు తెలుగుభాషా కీర్తిని చాటిచెప్పగా వ్యవహారక భాషా ఉద్యమంతో తెలుగు భాషా గొప్పదనాన్ని ప్రపంచవ్యాప్తంగా గిడుగు రామ్మూర్తి పంతులు తీసుకెళ్లారు. ఇంతటి గొప్ప చరిత్ర వున్న తెలుగు వ్యావహారిక భాషకు నేడు ఆదరణ లేకపోవడం బాధాకరం. ఇటీవల పలు అధికార ఉత్తర్వుల్లో కూడా తెలుగు భాషలో అచ్చుతప్పులు రావడం గమనించుకోవాల్సిన అంశం. ఇకనైనా తెలుగు ప్రజాల్లారా స్పందించండి.. తెలుగు భాషాను కాపాడుకుందాం.

- విద్యాసాగర్, తెలుగు అధ్యాపకుడు, ఆదర్శ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆత్మకూరు

తెలుగు భాషకు 'పెద్ద' రాముడు

మాతృభాషలోనే ఉత్తర ప్రత్యుత్తరాలు



కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ మేనేజర్ ఎన్.చిన్నరాముడికి తెలుగు భాషపై ప్రత్యేకమైన అభిమానం ఉంది. ఆయన సంతకాలు, తాపాలా, మార్గదర్శకాలు అన్నింటిని తెలుగులోనే రాస్తారు. నేటి కాలంలో అధికార భాషగా ఆంగ్లం ఎక్కువగా వాడుతున్న కూడ అధికారి అయిన చిన్నరాముడు మాత్రం తన మాతృభాషకు ప్రాధాన్యత ఇస్తూ 'పెద్ద'రాముడిగా ఖ్యాతి పొందారు. ఆయన ఈ అలవాటు సహచర ఉద్యోగుల్లోనూ ఒక మార్పు తీసుకువచ్చింది. కార్యాలయంలో పత్రాలు, నోటీసులు తెలుగులో రావడానికి ప్రోత్సాహం లభిస్తుంది. ప్రజలు సులభంగా అర్థం చేసుకునేలా అధికారిక సమాచారాన్ని తెలుగులో అందించడం ఆయన ముఖ్యలక్ష్యం. శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగు భాషపై చిన్నరాముడు చూపుతున్న ఈ మక్కువతో ఆయన ఆచరణ సహచరులకు ప్రేరణగా, ప్రజలకు ఆదర్శంగా నిలుస్తోంది.

భాషను బతికించుకోవాలి



తెలుగు భాషను నేడు తెలుగు దిన, వార, మాస పత్రికలు, టీవీ, సినిమా వంటి మాధ్యమాలే బతికిస్తున్నాయి. మొదటి నుంచి 'పొరుగింటి పుల్లగూర...'చందంగా మన పరిస్థితి, బతుకులు మారాయి. మన గొప్పదైన తెలుగు భాష కన్నా పరాయివాడు మాట్లాడే ఆంగ్ల భాషను ఇష్టపడతాం. మనం కట్టే పంచెకట్టు కన్నా ఆంగ్లేయుడు వాడే టై కోటును ఆశపడతాం. మారుతున్న కాలంలో కొంత మార్పులు అవసరమే అయినా, మన మూలాలను విడిచిపెట్టకూడదు. తెలుగు భాషలో చదువుకోకున్నా, భాష పట్ల నిర్లక్ష్యం వద్దు. తెలుగుకు సంబంధించిన గొప్ప పుస్తకాలు ఉన్నాయి. చదవండి. వాటిలోని మాధుర్యాన్ని ఆస్వాదించండి. తెలుగు కథలు ఎంతో హృద్యంగా సాగిపోతుంటాయి. మన భాషలో గొప్ప నాగరికత, సాంస్కృతికత, కుటుంబ, సామాజిక బాంధవ్యాలు గొప్పగా ఉంటాయి. భాషను ఆస్వాదించే వారికి గొప్ప అనుభూతే మిగులుతుంది.

- జి.ఉమామహేశ్వర్, కథా రచయిత, కర్నూలు

మాతృభాషలో నాటకానికి విశిష్ట స్థానం



ఏ ఇతర భాషలకూ లేని విశిష్టత తెలుగు భాషకు ఉంది. ఈ భాషలో పద్య నాటకాలు ప్రత్యేకం. పద్య నాటకాలు ప్రపంచంలోని ఏ ఇతర భాషల్లో కనిపించవు. తెలుగు భాష ఔన్నత్యాన్ని, విశిష్టతను చాటిచెప్పిన ఘనత పౌరాణిక, పద్య నాటకాలకూ దక్కుతుంది. 1992 నుంచి నాటక రంగంలో అనేక నాటకాలు వేశాను. మన భాషలో పలికే సంభాషణలు గంభీరంగా, అర్థవంతంగా నిలుస్తాయి. అలాగే పద్యాలాపన కూడా ఒక ప్రత్యేకంగా సాగుతుంది. దుర్యోధనుడు, భీముడు, నల కుబేరుడు, రావణ, విశ్వామిత్ర, చింతామణిలో భవానీశంకరం వంటి పాత్రలు మంచి గుర్తింపు తెచ్చాయి. జిల్లా తెలుగు దేశం పార్టీ సాంస్కృతిక విభాగం అధ్యక్షునిగానూ తెలుగు భాష ప్రాచుర్యానికి కృషి చేస్తున్నా. ఘనతర చరిత్ర గల తెలుగు భాషను పరిరక్షించుకోవడంలో అందరూ భాగస్వామ్యం కావాలి.

- పి.హనుమంతరావు చౌదరి, రంగస్థల నటుడు, కర్నూలు

నేటి నుంచి టీజీవీ కళాక్షేత్రంలో తెలుగు భాషా దినోత్సవాలు

● రేపు 24 గంటల నిర్విరామ పద్యనాటక ప్రదర్శనలు



మాట్లాడుతున్న పత్తి ఓబులయ్య

కర్నూలు కల్చరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం, గిడుగు రామమూర్తి పంతులు జయంతి వేడుకలను మూడు రోజుల పాటు ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్య వెల్లడించారు. రాష్ట్రంలోనే ప్రప్రథమంగా మూడు రోజుల తెలుగు భాషా దినోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. గురువారం కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కార్యక్రమ వివరాలను వెల్లడించారు. శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఉదయం 10 గంటలకు తెలుగు తల్లి, గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటాలకు నివాళి కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అనంతరం 'విద్య, బోధనలో తెలుగు భాష' అనే అంశంపై హైస్కూల్, కలాశాలల విద్యార్థులకు పోటీలు ఏర్పాటు చేశామన్నారు. హైస్కూలు విద్యార్థులను జూనియర్స్‌గా, ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ విద్యార్థులను సీనియర్స్‌గా పరిగణిస్తామని తెలిపారు. ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద నగదు ప్రోత్సాహకాలు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేస్తామని తెలిపారు.

'రికార్డు' దిశగా పద్యనాటక పోటీలు

తెలుగు భాషా దినోత్సవం వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం 9 గంటలకు టీజీవీ కళాక్షేత్రంలో పౌరాణిక, చారిత్రక ఏకపాత్రాభినయ పోటీలు ప్రారంభమవుతాయి. 80 మంది కళాకారులతో పగలు, రాత్రి ఏకధాటిగా 24 గంటల పాటు పద్య నాటక ప్రదర్శనలు కొనసాగుతాయి. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సు సంస్థ ప్రతినిధులు ఈ ప్రదర్శనలను తిలకించి రికార్డుల్లో నమోదు చేయనున్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రశంసాపత్రం, సత్కారం ఉంటుంది. అలాగే నగదు ప్రోత్సాహకాలు ఉంటాయి.

● **31న పుస్తక ఆవిష్కరణ :** తెలుగు భాషా దినోత్సవాలు చివరి రోజున ఆదివారం ఉదయం 10 గంటలకు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, కళారత్న పురస్కార గ్రహీత పత్తి ఓబులయ్య రాసిన 'పదవి మూలం... ఇదం జగత్' పుస్తక ఆవిష్కరణ నగర ప్రముఖులచే ఉంటుంది. సాయంత్రం విజేతలకు బహుమతి ప్రదానం, అనంతరం తెనాలి ఆరాధ్యుల నాటక సమాజం వారిచే 'ఎవరు' సాంఘిక నాటిక ప్రదర్శన ఉంటుందని ఓబులయ్య తెలిపారు. ఈ సమావేశంలో కార్యక్రమాల కోఆర్డినేటర్లు పి.రాజారత్నం, జీవీ శ్రీనివాసరెడ్డి, గాండ్ల లక్ష్మన్న, వీవీ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు తెలుగుతోటలో వేడుకలు..

కర్నూలు కల్చరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కర్నూలులోని తెలుగు కళాస్రవంతి ఆధ్వర్యంలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ఎండీ ఇనాయతుల్లా, ఎస్ఎస్ పటేల్, కన్వీనర్ మహమ్మద్ మియా ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. నగరంలో మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోట సమావేశ హాలులో సాయంత్రం 6 గంటలకు ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు కేసీ కల్కూర, అధ్యక్షులుగా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కేజీ గంగాధర రెడ్డి, విశిష్ట అతిథిగా తెలుగు భాషావికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్ఆర్‌కే శర్మ హాజరవుతారని తెలిపారు. ఈ సభలో గిడుగు స్మారక పురస్కారాలు ఎస్‌డీవీ అజీజ్, టి. వెంకటేశ్, పి. మారుతి, నాగమణి, కెంగార మోహన్‌కు అందజేస్తారని తెలిపారు.

వయోజన విద్యాశాఖలో ఖాళీల భర్తీకి ఆహ్వానం

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వయోజన విద్యాశాఖలో ఉమ్మడి జిల్లాలో ఐదు సూపర్‌వైజర్ పోస్టులకు డిప్యుటేషన్‌పై ఉపాధ్యాయులను ఆహ్వానిస్తున్నట్లు వయోజన విద్య సంచాలకులు చంద్ర శేఖర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని వయోజన శాఖలో సూపర్‌వైజర్లుగా పనిచేసేందుకు ఎస్జీటీలు, బాషా పండితులు, పీఈటీలు 45 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈనెల 30వ తేదీ నుంచి సెప్టెంబర్ 5వ తేదీ లోపు దరఖాస్తులను అందజేయాలని ఆయన కోరారు.



ఆదోని : ఆపరేషన్ సింధూర్‌లో విజయం సాధించిన అవతారంలో పూజలు అందుకుంటున్న వినాయకుడు



నంద్యాలలో బాలాజీ కాంప్లెక్స్‌లో విశ్వశాంతి మహాగణపతి



ఎమ్మిగనూరు పట్టణంలోని ఎంఎస్ నగర్‌లో తామర విత్తనాలతో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం



ఆదోని ఎల్‌బీ స్ట్రీట్‌లో ఎండుకొబ్బరితో తయారు చేసిన వెంకటేశ్వరుడి ఆకారంలో వినాయకుడు



అనంతపద్మనాభ స్వామి ఆకారంలో వినాయకుడు



కోడుమూరులో సాంస్కృతిక నృత్య ప్రదర్శన



నంద్యాల సంజీవనగర్ రామాలయంలో అరటికాయలతో మహాగణపతి

జైజై గణేశా..!

● ఘనంగా ఆరంభమైన గణేశ్ నవరాత్రి వేడుకలు

కర్నూలు/నంద్యాల కల్చరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): హిందువుల తొలి ఆరాధ్యదైవం విఘ్నేశ్వరుడి జన్మదిన వేడుక వినాయక చవితిని బుధవారం ఉమ్మడి జిల్లావాసులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. తమ గృహాల్లోని పూజా మందిరాల్లో చిన్న చిన్న మట్టి ప్రతిమలతో రూపొందించిన గణపతి మూర్తులను ప్రతిష్ఠించి ధూప దీప నైవేద్యాలతో షడ్రోపేత పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వినాయక చవితి మొదలు తొమ్మిదిరోజుల పాటూ కొనసాగే 'గణేశ్ నవరాత్రి' ఉత్సవాల సందడి ఆరంభమైంది. అంబరాన్ని అంటే సంబరాలతో ఉమ్మడి జిల్లాలో ఆయా ప్రాంతాల్లోని ఉత్సవ కమిటీల నిర్వాహకులు పార్వతీ నందనుడి మంటపాలకు తరలించి, పూజలతో ఉత్సవాలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల్లో పోటాపోటీగా భారీ విగ్రహాలను నెలకొల్పారు. ఈ ఏడాది గణేశ్ ఉత్సవాల్లో విగ్రహాలు వేటికవే ఆకర్షణీయంగా నిలుస్తున్నాయి. విభిన్న రూపాల్లో వినాయక ప్రతిమలు భక్తులకు దర్శనమిస్తున్నాయి.



ఎమ్మిగనూరులో వీణాపాణిగా దర్శనమిస్తున్న వినాయకుడు



కోసిగిలో బాలకృష్ణుడు అవతారంలో..



నారాయణగుంత కాలనీలో పూజలందుకుంటున్న మహాయోగి లక్ష్మమ్మవ్వ, వినాయకుడు

యజమానులపై దాడి.. గొర్రెల అపహరణ

కొలిమిగుండ్ల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదనంతపురం, అబ్దులాపురం గ్రామాల మధ్య మంగళవారం అర్ధ రాత్రి యజమానులపై దాడి చేసి 11 గొర్రెలను అపహరించుకొని వెళ్లారు. మదనంతపురం గ్రామానికి చెందిన చిగిరి చిన్నరంగప్ప కుమారుడు రామకృష్ణ దేవుని మాన్యంలో గొర్రెల మంద తోలారు. గొర్రెలు బెదురుకోవడంతో తండ్రి, కుమారుడు లేచి, టార్చ్ లైట్లు వేశారు. దీంతో వారిపై దొంగలు రాళ్లతో దాడి చేశారు. దీంతో చీకట్లో కొద్ది దూరం పరుగెత్తిన వారు గ్రామంలో వారికి సమాచారం అందించగా, గ్రామస్థులు అక్కడికి చేరుకున్నారు. అయితే అప్పటికే దొంగలు మందలోని 11 గొర్రెలను అపహరించి పరారైనట్లు తెలిపారు. వీటి విలువ రూ.1.50లక్షలు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చెక్ బౌన్స్ కేసులో ఉపాధ్యాయుడికి జైలు

కర్నూలు లీగల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అప్పుకు బదులుగా చెల్లని చెక్ ఇచ్చిన ప్రభుత్వ ఉపాధ్యాయుడికి ఏడాది జైలు, చెక్కు మొత్తం జరిమానాగా చెల్లించాలని ఆదేశిస్తూ కర్నూలు ఎక్సైజ్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.అనిల్ కుమార్ గురువారం తీర్పు చెప్పారు. నగరానికి చెందిన ఎస్కే మద్దిలేటి 2020లో నాలుగు దఫాలుగా రూ.8లక్షలు అప్పుగా తీసుకుని ప్రామిసరి నోటును కె.మనోహర్‌కు రాసిచ్చారు. ఎస్కే మద్దిలేటి 2021 మార్చి 12న రూ.8లక్షలు విలువైన బ్యాంకు చెక్కును మనోహర్‌కు ఇచ్చారు. ఆ చెక్కును మనోహర్ తన బ్యాంకు ద్వారా విత్‌డ్రా కోసం పంపారు. అయితే ఉపాధ్యాయుడి ఖాతాలో తగిన నిల్వలు లేకపోవడంతో ఆ చెక్కు బౌన్స్ అయింది. దీంతో మనోహర్ కోర్టులో కేసు దాఖలు చేశారు. ఉపాధ్యాయుడిపై నేరం రుజువు కావడంతో ఏడాది కారాగార శిక్ష, చెక్కు మొత్తం జరిమానాగా ఫిర్యాదికి చెల్లించాలని ఆదేశిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు.

వేరుశనగ మిషన్ బోల్తా

- మహిళా కూలీ మృతి.. ముగ్గురికి గాయాలు

ప్యాపిలి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపాడు గ్రామం సమీపంలో గురువారం వేరుశనగ మిషన్ వాహనం బోల్తా పడి ఓ మహిళా కూలీ మృతి చెందగా ముగ్గురికి గాయాలయ్యాయి. గుడిపాడు గ్రామానికి చెందిన కళావతి(33), నాగమ్మ, వెంకటలక్ష్మి, నాగభూషణంరెడ్డి వేరుశనగ మిషన్ దగ్గర పనిచేయడానికి వెళ్లారు. మిషన్ వాహనంలో కూర్చొని పొలానికి బయలుదేరారు. మార్గం మధ్యలో వాహనం బోల్తా పడి కళావతికి తీవ్ర గాయాలు కాగా ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ప్యాపిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

వెల్దుర్తి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలో రామళ్లకోట గ్రామానికి చెందిన రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వివరాల మేరకు.. రైతు కొట్టం రామానాయుడు(33) తనకున్న ఎకరన్నర పొలంలో మొక్కజొన్న సాగుచేశాడు. బుధవారం సాయంత్రం పొలానికి నీరు కట్టడానికి వెళ్లాడు. మోటర్ స్టాటర్ ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. రాత్రి అవుతున్నా రాలేదని భార్య పద్మావతి వెళ్లి చూడగా విగతజీవిగా పడిఉన్నాడు. సాయంత్రం అవుతున్నా రాకపోవడంతో భార్య పద్మావతి పొలానికి వెళ్లి చూడగా విగతజీవిగా పడి ఉన్నాడు. కుటుంబసభ్యుల సాయంతో వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రామానాయుడు(ఫైల్)

ట్రాక్టర్ ప్రమాదంలో బాలుడు..

దేవనకొండ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుప్పనగుర్తి గ్రామంలో పొలంలో ఉల్లి దిగుబడిని లోడ్ చేస్తుండగా ట్రాక్టర్ ఎక్కడంతో బాలుడు మృతి చెందాడు. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మహేష్, శ్రావణి దంపతులకు ఇద్దరు కుమారులు. బుధవారం తమ పొలంలో ఉల్లి పంటను కోసేందుకు వెళ్తు రెండో కుమారుడు ఈశ్వంత్‌ను తీసుకెళ్లారు. పంటను ట్రాక్టర్ ద్వారా తరలిస్తుండగా బాలుడిని గమనించక నడపటంతో ట్రాక్టర్ బాలుడిపై ఎక్కడంతో బాలుడు అక్కడిక్కడే మృతి చెందాడు. సీఐ వంశీనాథ్‌ను వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందలేదన్నారు.



ఈశ్వంత్(ఫైల్)

పాము కాటుతో యువకుడు..

డోన్ టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటనాయునిపల్లె గ్రామంలో పాము కాటులో ఓ యువకుడు మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు గ్రామంలో పొలం పనులు చేస్తుండగా.. బి.సతీష్ కుమార్‌ను పాము కాటు వేయడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని గ్రామస్థులు తెలిపారు.

పోక్సో కేసు నమోదు

నంద్యాల టౌన్, ఆగస్టు 28 ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఓ బాలికపై అత్యాచారం చేసిన వారిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ అస్రర్‌బాషా గురువారం తెలిపారు. సీఐ వివరాల మేరకు... నంద్యాల పట్టణం దేవనగర్‌కు చెందిన యువకులు ఆబిద్, అఫ్రోజ్ బాలికకు గత కొంతకాలంగా మాయమాటలు చెప్పి లోబరుచుకుని అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో ఆ బాలికకు కడుపు నొప్పి రావడంతో విషయాన్ని తన తల్లికి చెప్పింది. రెండు రోజుల క్రితం ఆసుపత్రిలో చూపించగా గర్భవతి అని తెలిసింది. దీంతో తల్లి ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వైద్య పరీక్షల కోసం బాలికను జీజీహెచ్‌కు తరలించారు.

ప్రేమ జంటలే టార్గెట్!

- వారిని బెదిరించి దోపిడీ చేస్తున్న ముఠా అరెస్టు

కర్నూలు క్రైం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రేమ జంటలను బెదిరించి దోపిడీ చేస్తున్న ముగ్గురు నిందితులను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. సీఐ విక్రమసింహ, ఎస్ఐ మోహన్ కిషోర్ రెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా.. గోర్లగుట్ట నాగేంద్రుడు (ముజఫర్‌నగర్), కురువ రమేష్ (టీవీ9 కాలనీ), దూదేకుల మాలిక్ బాషా (దిన్నెదేవర పాడు)లు ముఠాగా ఏర్పడి ప్రేమ జంటలను వెంబడించి వారి ఫొటోలను తీసి బెదిరించేవారు. జంటల నుంచి డబ్బు, బంగారు బలవంతంగా లాక్కుని పరారయ్యేవారు. ఈ క్రమంలో ఈ నెల 19న ఓ యువతి తన స్నేహితుడితో కలిసి రాయలసీమ యూనివర్సిటీ వైపు వెళ్తుండగా.. హ్యాంగ్ అవుట్ హోటల్ వద్ద నిందితులు వీరి ఆటోను ఆపారు. యువతి అతని స్నేహితుని ఫొటోలు తీసి మీ తల్లిదండ్రులకు చెబుతామని కత్తితో బెదిరించి బంగారు గొలుసు, నగదు లాక్కుని పరారయ్యారు. మరో రెండు రోజుల తర్వాత ఆ యువతికి ఫోన్ చేసి మరోసారి డబ్బు డిమాండ్ చేశారు. దీంతో యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితులను పోలీసులు గుర్తించి వారిని అరెస్టు చేశారు. నిందితుల నుంచి కారు, స్కూటీ, పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు.



నిందితులను చూపుతున్న పోలీసులు

మళ్లీ ఉల్లి పతనం

(5వ పేజీ తరువాయి)

ప్రస్తుతం మన దేశంలోని పశ్చిమ బెంగాల్, కర్నాటక, తమిళనాడు, ఒడిసా తదితర ప్రాంతాలకు ఎగుమతి చేసే పరిస్థితులు లేవు. సరిహద్దులు మూసివేయడంతో ఇతర దేశాలకు కూడా ఇక్కడి నుంచి అమ్ముడుపోవడం లేదు. దీంతో పాటు మహారాష్ట్రలో ఉల్లి సాగు ఎక్కువగా కావడం వల్ల సోలార్, తదితర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున దేశంలోని వివిధ ప్రాంతాలకు అక్కడి వ్యాపారస్థులు సరఫరా చేస్తున్నారు. నేల స్వభావాన్ని పట్టి ఉమ్మడి జిల్లాలో ఉత్పత్తి అవుతున్న ఉల్లి ఎక్కువ రోజులు మన్నిక ఉండదని, కేవలం 10 రోజులకు మించి ఉండకపోవడం వల్ల కుల్లిపోయే పరిస్థితి ఉండటం వల్లనే రైతుకు గిట్టుబాటు కావడం లేదని అధికారులు చెబుతున్నారు.

2020 నుంచి 2025 వరకు కర్నూలు మార్కెట్ యార్డుకు అమ్మకానికి వచ్చిన ఉల్లి

సంవత్సరం	క్వింటాళ్లు
2020-21	3,76,941
2021-22	4,46,793
2022-23	3,51,101
2023-24	4,41,525
2024-25	6,57,785
2025-26	54,874 (ఇప్పటి వరకు)

అధికారుల ఉక్కిరి బిక్కిరి

గత సంవత్సరం సెప్టెంబరు నెలలో ఉమ్మడి జిల్లాల రైతులు 12వేల క్వింటాళ్ల ఉల్లిని కర్నూలు మార్కెట్‌యార్డుకు అమ్మకానికి తీసుకువచ్చారు. ఈ సంవత్సరం ముందస్తు వర్షాల కారణంగా మే నెలలోనే ఉల్లి సాగును రైతులు మొదలెట్టారు. ప్రస్తుతం ఆ ఉల్లి కోతకు వచ్చింది. రోజు పదివేల క్వింటాళ్ల దాకా ఉల్లి కర్నూలు మార్కెట్ యార్డుకు పోటెత్తుతోంది. మరో వైపు వర్షాలు పడుతుండటంతో పొలాల్లోనే ఉల్లిని ఉంచలేక రైతులు యార్డుకు తెస్తున్నారు. కొంత మంది రైతులు అయితే.. వాహనాలకు కూడా డబ్బులు లేక కూలీల ఖర్చులు భరించలేక కనీస ధర కూడా యార్డులో లభించ లేదనే సమాచారం తెలుసుకుని పశువులకు మేతగా వదిలేస్తున్నారు. ఉల్లిని కొనుగోలు చేసేందుకు కర్నూలు మార్కెట్‌యార్డులో 30 మంది దాకా లైసెన్సులు తీసుకున్నారు. వీరిలో కేవలం 10 మంది మాత్రమే రైతుల నుంచి ఉల్లిని కొనుగోలు చేస్తున్నారు. లైసెన్సు తీసుకున్న 30 మంది వ్యాపారస్థుల చేత కొనుగోలు చేయించడంతో పాటు టెండరును 10 గంటలకే పూర్తి చేస్తే ఎప్పటికప్పుడు సాయంత్రంలోపు ఉల్లి కొనుగోలు పూర్తవుతాయనీ, తమకు రోజుల తరబడి యార్డులోనే ఉండాల్సిన అవసరం ఉండదని రైతులు పేర్కొంటున్నారు.

పరిస్థితిని చక్కదిద్దుతాం



గత సంవత్సరం కంటే ఈసారి కర్నూలు యార్డుకు ఊహించని రీతిలో ఉల్లిగడ్డలు అమ్మకానికి వస్తున్నాయి. అయినా పరిస్థితిని చక్కదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రైతులు గ్రామాల్లోనే ఉల్లిని గ్రేడింగ్ చేసి అమ్మకానికి తెస్తే మంచి ధర లభించడంతో పాటు సమయం కూడా ఆదా అవుతుంది. గత సంవత్సరంతో పోల్చితే ఈసారి ధర కొద్దిగా తక్కువగా ఉంది. రైతుల పరిస్థితిపై మంత్రులు రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లాము. త్వరలోనే ప్రభుత్వం రైతులకు అనుకూలంగా నిర్ణయాన్ని తీసుకుంటుందని ఆశిస్తున్నాము.

- జయలక్ష్మి, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ, కర్నూలు మార్కెట్ యార్డు

ఉల్లి రైతులు ఆందోళన చెందొద్దు



ఉల్లి రైతులతో మాట్లాడుతున్న జేడీ రామాంజనేయులు

కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతులు ఆందోళన చెందవద్దని మార్కెటింగ్ జేడీ రామాంజనేయులు సూచించారు. గురువారం కడప నుంచి వచ్చిన మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు, డిప్యూటీ డైరెక్టర్ లావణ్య కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి రైతులను పరామర్శించారు. ప్రస్తుతం ధర ఎంత ఉంది?, పంట సాగుకు ఎంత ఖర్చు చేశారు?, గిట్టుబాటు అవుతుందా? లేదా? అనే అంశాలపై రైతులను ఆరా తీశారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటోందని, క్వింటం ఉల్లిని రూ.1200కు కొనుగోలు చేసి రైతులకు గిట్టుబాటు ధర అందించాలని సీఎం చంద్రబాబు ఆదేశించినట్లు తెలిపారు. తక్షణమే రైతుల నుంచి 5వేల మెట్రిక్ టన్నుల ఉల్లిని కొనుగోలు చేసి ప్రభుత్వ గోదాములు, ప్రైవేటు కమ్యూనిటీ హాలులో నిల్వ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. లైసెన్సు ఉన్న ప్రతి వ్యాపారి వేలం పాటలో పాల్గొనేలా చూడాలని కర్నూలు మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మిని ఆదేశించారు. త్వరితగతిన ఉల్లి కొనుగోలు జరిగేలా టెండర్లు నిర్వహించాలన్నారు. పత్తికొండ, కోడుమూరు ప్రాంతాల్లోని గ్రామాల్లో ఉల్లి నిల్వలతో పాటు రైతులతో మాట్లాడారు.

సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం

- సర్వర్ మొరాయింపుతో అర్ధరాత్రి దాకా కొనసాగిన ప్రక్రియ
- ఇబ్బందులు పడిన డీఎస్సీ అభ్యర్థులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ఎంపిక అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన గురువారం ప్రారంభమైంది. సర్వర్ డౌన్ కారణంగా ప్రక్రియ నత్తనడకన కొనసాగింది. గురువారం మొదటి రోజు సాయంత్రం 6 గంటలకు 1,050 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల ప్రక్రియ పూర్తయింది. కాల్ లెటర్స్ వచ్చిన అభ్యర్థుల సమస్యలను పరిష్కరించడంలో విద్యాశాఖ అధికారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మెగా డీఎస్సీలో ఎస్‌జీటీ 1827, స్కూల్ అసిస్టెంట్లు (నాన్ లాంగ్వేజ్) 314, స్కూల్ అసిస్టెంట్లు (లాంగ్వేజ్) 537 పోస్టుల భర్తీకి మెరిట్ కం రోస్టర్ ప్రకారం అభ్యర్థుల ఎంపికకు సంబంధించిన సర్టిఫికెట్ల పరిశీలన జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టారు. కర్నూలు నగరంలోని రాయలసీమ విశ్వవిద్యాలయం, నన్నూరు సమీపంలోని మారుతి ఎస్టేట్‌లోని శ్రీ రాఘవేంద్ర బీఈడీ కళాశాల, శ్రీనివాస బీఈడీ కళాశాలలో అభ్యర్థుల పరిశీలన కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 54 వెరిఫికేషన్ కేంద్రాలను నియమించారు. ఒక్కో బృందంలో ఎంఈవో, హెచ్ఎంలు, డిప్యూటీ తహసీల్దార్, డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించారు. ఓపెన్ కేటగిరిలో ఇతర జిల్లాలకు చెందిన అభ్యర్థులు 336 పోస్టులు సాధించారు. ఎస్టీటీలోనే 133 మంది పోస్టులకు ఎంపికయ్యారు. ఉమ్మడి కర్నూలు జిల్లా అభ్యర్థుల కంటే శ్రీకాకుళం, విజయనగరం తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి ప్రకాశం జిల్లాల అభ్యర్థులు ఓపెన్ కేటగిరిలో నాన్ కేటగిరి పోస్టులను అత్యధికంగా దక్కించుకున్నారు.

అవస్థలు పడిన అభ్యర్థులు

కొంత మంది అభ్యర్థులు కాల్‌లెటర్లు మెసేజ్‌లు రాకున్నా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కేంద్రాల వద్ద చేరుకున్నారు. తమ కంటే తక్కువ మార్కులు, ర్యాంకులు వచ్చిన వారికి కాల్ లెటర్స్ ఎలా పంపిస్తారని విద్యాశాఖ అధికారులను ప్రశ్నించారు. అలాగే స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్‌లో ఒకే కేటగిరికి చెందిన అభ్యర్థికి 81వ ర్యాంకు వచ్చినా తనకు కాదని 105, 106 ర్యాంకులు వచ్చిన అభ్యర్థులకు కాల్ లెటర్స్ రావడం పట్ల విద్యాశాఖ అధికారుల వద్ద తమ బాధను వెల్లబోసుకున్నారు. అలాగే సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం కాల్ లెటర్స్ వచ్చిన అభ్యర్థికి కటాఫ్ డేట్ తర్వాత విద్యార్హతకు సంబంధించిన యూనివర్సిటీ సర్టిఫికెట్లు జారీ చేసిన తేదీల్లో వ్యత్యాసం ఉండటంతో విద్యాశాఖ అధికారులు వెరిఫికేషన్‌కు నిరాకరించడంతో అభ్యర్థులు ఆందోళనలకు గురయ్యారు. ఎస్‌జీటీ పోస్టుకు పరీక్ష రాస్తే స్కూల్ అసిస్టెంట్లు, పీజీటీ పోస్టులకు కాల్ లెటర్స్ రావడం పట్ల అభ్యర్థులు అవాక్కయ్యారు. సాంకేతక కారణాలు తలెత్తడంతో మెగా డీఎస్సీ ఎంపిక సర్టిఫికెట్ల వెరిఫికేషన్ వచ్చిన అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని సమస్యలు పరిష్కారం జిల్లా విద్యాశాఖ అధికారుల పరిధిలో లేకపోవడంతో రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గెజిటెడ్ ఆఫీసర్ల సంతకం చేయించుకోకుండానే హాజరైన పలువురు అభ్యర్థులు సంతకాల కోసం అభ్యర్థులు అధికారుల చుట్టూ తిరుగుతూ ఒత్తిడికి గురయ్యారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, హెచ్ఎంలతో అభ్యర్థుల సర్టిఫికెట్లకు అటెస్టేషన్ చేయించడంతో ఊరట చెందారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఇస్మాయిల్, మరియానందం, పీఆర్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణానిధిమూర్తి, జిల్లా అధ్యక్షుడు ఎన్వీ కృష్ణారెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి, ప్రధాన కార్యదర్శి జనార్దన్, ఆప్టా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ కుమార్, జిల్లా అధ్యక్షులు రవికుమార్‌తో పాటు పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు కేంద్రాల్లో అభ్యర్థుల సమస్యలను తెలుసుకుని విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

అర్ధరాత్రి వరకూ కొనసాగిన పరిశీలన..

మొదటి రోజు 2,307 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ సర్టిఫికెట్ల పరిశీలన అర్ధరాత్రి వరకూ కొనసాగిది. వీరే కాకుండా మరో 260 మంది అభ్యర్థులకు గురువారం రాత్రి కాల్‌లెటర్స్ విడుదల కానున్నట్లు విద్యాశాఖ అధికారులు చెప్పారు.

పరిశీలించిన అధికారులు

ఆర్‌యూలో సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రాన్ని జేసీ నవ్య పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. రాష్ట్ర పాఠశాలల విద్య ఏడీ ప్రతాప్ రెడ్డి, అబ్రహం, డీఈవో శామ్యూల్‌పాల్ కేంద్రాలను పర్యవేక్షించారు.

అహోబిలం మెట్ల మార్గంలో విరిగిపడ్డ కొండచరియలు



అహోబిలంలో మెట్ల మార్గంలో విరిగి పడిన కొండ చరియ

ఆళ్లగడ్డ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఎగువ అహోబిలంలోని మెట్టమార్గంలో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల బుధవారం తెల్లవారు జామున ఎగువ అహోబిలానికి వెళ్లే మెట్ల మార్గంలో సరిగ్గా భక్తులు పైకి ఎక్కే మెట్ల వద్ద కొండ చరియ విరిగిపడింది ఆ సమయంలో ఎవరూ లేక పోవడంతో ప్రాణాపాయం తప్పింది. అయితే ఈ కొండ చరియ చెట్టు, విద్యుత్ స్తంభం తాకుతూ పడడంతో విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. విద్యుత్ తీగలు సైతం మెట్ల మార్గంలో పడిపోయాయి. భక్తుల సంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని ఆలయ అర్చకులు తెలిపారు. ఎంపీడీవో నూర్జహాన్, విద్యుత్ ఏఈ కృష్ణయ్య ఘటనా స్థలానికి చేరుకొని కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

పిచ్చికుక్క దాడి.. ఐదుగురికి గాయాలు



తీవ్రంగా గాయపడ్డ మస్తాన్‌సాబ్

ఆలూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హత్తిబెళగల్ గ్రామంలో గురువారం పిచ్చికుక్క వీరంగం సృష్టించింది. జనంపై దాడి చేసి ఐదుగురిని గాయపరిచింది. ఈ దాడిలో మస్తాన్‌సాబ్, గౌతమ్, నాగప్ప, నబీ, షాషావలి గాయపడ్డారు. వీరిని గ్రామస్థులు ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మస్తాన్‌సాబ్, గౌతమ్‌కు తీవ్ర గాయాలు కావడంతో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఆదోనికి తరలించారు.

టమోటాకు తెగులు.. రైతుకు దిగులు

- వర్షం ప్రభావంతో కాయలకు మచ్చలు
- పంటను వదిలేసిన రైతులు



టమోటాను తొలగిస్తున్న కూలీలు

తుగ్గలి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాల ప్రభావంతో టమోటా పంట దెబ్బతిని రైతులు నష్టపోయారు. మండలంలో ఈ ఖరీఫ్‌లో దాదాపు 2వేల ఎకరాల్లో టమోటా సాగు చేశారు. మొదట్లో వర్షాలు కురువకపోవడంతో రైతులు నీళ్లు పోసి మొక్కలను నాటారు. ఎన్నో ఇబ్బందులు, వ్యవ ప్రయాసలకోర్చి పంటను కాపాడుకున్నారు. మొక్కలు బాగా పెరగడంలో మంచి దిగుబడి వస్తుందని, ధర కూడా బాగా ఉండటంతో ఈ ఏడాది కలిసొస్తుందని ఆశపడ్డారు.


రూ.1.10లక్షలతో సాగు చేశా



మూడున్నర ఎకరాల్లో దాదాపు రూ.1.10 లక్షలు ఖర్చుపెట్టి టమోటా సాగు చేశాను. మొక్కల కొనుగోలు, వాటిని బతికించుకోవడానికి వ్యయప్రయాసలకు గురయ్యారు. తీరా దిగుబడి వచ్చే సమయానికి భారీ వర్షాలు కురి పంట కుల్లి పోయింది. చెడిపోయిన కాయలను తీసివేయడాని కూలీలకే రూ.5వేలు అయింది. **- రఘు, జొన్నగిరి, తుగ్గలి మండలం**

ముంచిన వర్షం

దిగుబడి వచ్చే సమయంలో 15 రోజుల పాటు వర్షాలు కురవడతో పంట దెబ్బతింది. టమోటా కాయలకు మచ్చ తెగులు సోకి కాయలు నాశనయ్యాయి. దీంతోపాటు చెట్టుకు కూడా తెగులు సోకడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. మచ్చలు ఉన్న, కుళ్లిపోయిన టమోటాలను ఏరివేసేందుకు కూలీలను నియమించుకున్నారు. దీంతో పెట్టుబడి పెరగగా, కాయలకు మచ్చ రావడంతో వాటిని పొలంలోనే పారవేయాల్సి వస్తోందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు



కుప్పగా పోసిన కుళ్లు, మచ్చ టమోటాలు

తొమ్మిది బార్లకు లైసెన్స్ దరఖాస్తులు

కర్నూలు అర్బన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 26 బార్లకు లైసెన్సు కోసం దరఖాస్తులు ఆశించిన తీరులో రాలేదు. గురువారం సాయంత్రానికి 9 బార్లకు ఫుల్ సేప్‌లో దరఖాస్తులు పడ్డాయి. ఒక్కో బార్‌కు 4 దరఖాస్తులు, ఆపై ఉంటేనే లాటరీ పద్ధతికి అర్హతగా ప్రభుత్వం పేర్కొన్న విషయం తెలిసిందే. ఆ క్రమంలో ఈనెల 18న నోటిఫికేషన్ జారీ చేయగా ఈనెల 26తో గడువు దర ఖాస్తు ప్రక్రియను ముగింపుగా ప్రకటిం చారు. కానీ గడువు ముగిసినా ఆశించిన తీరులో ఎవరూ దరఖాస్తూ ప్రక్రి యకు స్పందించకపోవడంతో

నేటితో ముగియనున్న గడువు

ఈనెల 29 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం గడువును పొడిగించింది. అయినప్పటికి ఆశించిన తీరులో యాజమాన్యాల నుంచి స్పందన కనిపించ లేదు. శుక్రవారం దరఖాస్తు చేసుకునేందుకు వస్తారని ఎక్సైజ్ శాఖ ఆశిస్తోంది. ఇప్పటివరకు ఆదోని-4, కర్నూలు-5 బార్లకు సంబంధించి ఒక్కో బార్‌కు నాలుగు దరఖాస్తుల చొప్పున చేసుకున్నారు. ఎమ్మిగనూరు, గూడూరుల నుంచి ఎలాంటి స్పందన లేదు.

వామపక్ష నాయకుల నిరసన


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు డి.గౌస్‌దేశాయ్, బి.గిడ్డయ్యలు మాట్లాడుతూ ఉమ్మడి తెలంగాణ రాష్ట్రంలోని బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరుల సాక్షిగా చంద్రబాబు తీసుకున్న స్మార్ట్ మీటర్లు, విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా మరో ఉద్యమాన్ని చేపడతామని వామపక్ష నాయకులు ప్రతిజ్ఞ చేశారు. 2000లో విద్యుత్ సంస్థకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన రామక్రిష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామిల వర్ధంతిని పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ నగర కార్యదర్శులు ఎం.రాజశేఖర్, రామక్రిష్ణారెడ్డి, నాయకులు రాధాక్రిష్ణ, ఆనంద్‌బాబు, గురుశేఖర్, జగన్నాథం, మునెప్ప, లెనిన్‌బాబు పాల్గొన్నారు.

నగర పాలకలో అంతర్గత ప్రక్షాళన

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): నగర పాలక కార్యాలయంలో ఉద్యోగులను అంతర్గత ప్రక్షాళన చేస్తూ కమిషనర్ పి.విశ్వనాథ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఎక్కువ శాతం రెవెన్యూ విభాగంలోని అవినీతిపై కార్పొరేటర్లు ప్రశ్నించడంతో రెవెన్యూ శాఖలో అంతర్గత బదిలీ చేశారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు సిబ్బందిని స్థానచలనం కల్పించారు. జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్లకు స్థానాలు కేటాయించారు. అంతే కాకుండ కొందరు జూనియర్ అసిస్టెంట్లకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం నగర పాలకకు సంబంధించి కాంప్లెక్స్ విషయంలో ఇటీవల కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 25 సంవత్సరాల కాలపరిమితి పూర్తి చేసుకున్న దుకాణాలకు నోటీసులు ఇవ్వడంతో సిబ్బంది పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఈ మేరకు సదరు సిబ్బందికి మెమోలు కూడా జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే ఉద్యోగులకు అంతర్గత బదిలీలు చేసినట్లు కార్యాలయంలో చర్చించుకుంటున్నారు.

నేడు పట్టణ ప్రణాళిక సమస్యలపై ఓపెన్ ఫోరం

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రణాళిక సమస్యలపై శుక్రవారం ఓపెన్ ఫోరం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎస్బీఐ కాలనీలోని కౌన్సిల్ సమావేశం భవనంలో పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించిన ఎల్‌ఆర్‌ఎస్, నిర్మాణ అనుమతులు వంటి సేవలలో తలెత్తుతున్న ఇబ్బందులపై పౌరులు తమ సమస్యలను నేరుగా చెప్పవచ్చన్నారు. పౌరుల ఫిర్యాదులను వెంటనే నమోదు చేసి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశిస్తామని కమిషనర్ పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

నిండుకుండలా చంద్రాయణి తిప్ప


నీటితో కళకళలాడుతున్న చంద్రాయణి తిప్ప

కోడుమూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): గూడూరు సెక్షన్ కింద ఉన్న చంద్రాయణి తిప్ప (చిన్నరాయుడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్) నిండు కుండలా మారింది. ఐఏబీ సమావేశంలో కోడుమూరు, పాణ్యం ఎమ్మెల్యేలు బొగ్గుల దస్తగిరి, గౌరు చరిత, కేడీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి తిప్పను నీళ్లతో నింపాలని కోరారు. ఇందులో భాగంగా ఇరిగేషన్ ఈఈ పాండురంగయ్య ఆదేశాల మేరకు ఎల్లెల్సీ నీటిని విడుదల చేసి అధికారులు తిప్పకు జలకళ తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సాగునీటి సంఘం డీసీ ఛైర్మన్ ధర్మారెడ్డి, ఎల్లెల్సీ గూడూరు సెక్షన్ ఏఈ లక్ష్మన్న తిప్పను గురువారం పరిశీలించారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం: ఎంపీ

కర్నూలు అర్బన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. గురువారం నగరంలోని తన కార్యాలయంలో దేవనకొండకు చెందిన మల వెంకటేశ్వర్లు ఆరోగ్య సమస్యలతో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. అనంతరం వైద్య ఖర్చుల సాయం కోసం ఎంపీని సంప్రదించి ముఖ్యమంత్రి సహాయ నిధి కి దరఖాస్తు చేసుకోగా రూ.1,23,919 మంజూరయ్యాయి. ఎంపీ తన కార్యాలయంలో బాధితుడికి సీఎంఆర్‌ఎఫ్ చెక్‌ను అందజేశారు.

'ప్రధానమంత్రి బీమా యోజన'ను వినియోగించుకోండి

సి.బెళగల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ప్రధాన మంత్రి బీమా యోజన పథకాన్ని వినియోగించుకోవాలని కెనరా బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మెనేజర్ సుశాంత్‌కుమార్ సూచించారు. గురువారం మండల కేంద్రంలో కెనరాబ్యాంక్ యాభై ఏళ్లు పూర్తయిన సందర్భంగా బ్యాంక్ ఖాతాదారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంక్ మెనేజర్ ప్రసంగి, గురుకుల ప్రిన్సిపాల్ చింతలయ్య, కిష్టప్ప, బాషా, నూర, బజారప్ప, దస్తగిరి, వెలుగు ఏపీఎం రమేష్ పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

సి.బెళగల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రైతులు పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని నంద్యాల ప్రాంతీయ పరిశోధన శాస్త్రవేత్తలు విష్ణువర్ధన్, బాలాజీ నాయక్ సూచించారు. గురువారం వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంపీఈవోలు హిమబిందు, శశికాంత్, వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు ఏడీఈ నాగప్రసాద్ గురువారం తెలిపారు. సంతోష్‌నగర్, పవర్‌హౌస్ సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయక చవితి

వాడవాడలా కొలువుదీరిన గణనాథులు

కర్నూలు కల్చరల్/ కలెక్టరేట్ /అర్బన్/ న్యూసిటీ/ ఓర్వకల్లు/కల్లూరు/ గూడూరు/కోడుమూరు/సి.బెళగల్/ ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో వినాయక చవితిని బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా మండపాలలో కొలువుదీరిన గణనాథులకు భక్తులు పూజలు చేశారు. కోడుమూరు తదితర మండలాల్లో మూడు రోజుల పాటు పూజలందుకున్న వినాయకుడిని నిమజ్జం చేస్తారు. కోడుమూరు పట్టణ సమీపంలోని వినాయక ఘాట్‌లో అర్చకులు జలహారతి ఇచ్చారు.


ఈ.తాండ్రపాడులో వినాయకుడికి పూజలు చేస్తున్న రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ కుటుంబ సభ్యులు


వాసవీ నగర్‌లో కొలువుదీరిన గణనాథుడు


మున్సిపల్ ఆఫీసు వద్ద..


బుధవార పేటలో..


వన్ టౌన్‌లో..


రాంబొట్లలో..


కుమ్మరి వీధిలో..


కలెక్టరేట్‌లో పరిపాలనా వినాయకునికి పూజలు చేస్తున్న జేసీ నవ్య, అధికారులు


జిల్లా పరిషత్‌లో..


టీడీపీ కార్యాలయంలో..


కాంగ్రెస్ కార్యాలయంలో..


బిర్లాగేట్‌లో..


హుసేనాపురంలో..


కల్లూరు మండలం ఉలిందకొండలో..


బి.క్యాంపులో..


ఓర్వకల్లులో..


గాంధీనగర్ అపార్ట్‌మెంట్‌లో..


సి.బెళగల్ మండలం పోలకల్లులో..


కోడుమూరులో..


కోడుమూరులో జలహారతి ఇస్తున్న పండితులు


గూడూరులో..


లలితాపీఠంలో సంగీత కచ్చేరీ చేస్తున్న సూర్యకళా సంస్థ కళాకారులు

లావణ్యకు అభినందన

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన మెగా డీఎస్సీ -2025 సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రంలో గురువారం మెగా డీఎస్సీ ఎస్‌జీటీ కేటగిరిలో ఫస్ట్ ర్యాంకు సాధించిన లావణ్యను పాఠశాలల విద్యాశాఖ అడిషినల్ డైరెక్టర్ బి.ప్రతాప్ రెడ్డి, డీఈవో శామ్యూల్ పాల్, పీఆర్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటు వి. కరుణానిధిమూర్తి, జిల్లా అధ్యక్షుడు ఎన్వీ కృష్ణారెడ్డి, రాంపక్కీరెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయ, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ చాంద్‌బాషా పాల్గొన్నారు.

● మెగా డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రంలో పాఠశాలల విద్యాశాఖ అడిషినల్ డైరెక్టర్ బి.ప్రతాప్‌రెడ్డిని కలిసి అభ్యర్థుల సమస్యలను పరిష్కరిం చాలని కోరారు. కార్యక్రమంలో ఆప్టా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, సేవాలాల్ నాయక్ పాల్గొన్నారు.

● మెగా డీఎస్సీ పరిశీలన కేంద్రాల్లో అభ్యర్థులకు సంబంధించి ఉత్పన్నమైన సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్ కుమార్, జిల్లా అధ్యక్షుడు రవికుమార్, పాఠశాలల విద్యాశాఖ అడిషినల్ డైరెక్టర్ బి.ప్రతాప్ రెడ్డిని కలిసి విన్నవించారు. అభ్యర్థులు కొన్ని అంశాల్లో గందరగోళానికి గురవుతున్నారని, స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీలో సెలెక్ట్ అయి ఉండి ఆప్షన్ ఇచ్చే విషయంలో కొంత మందికి ఇబ్బందులు ఉన్నాయన్నారు. కొంత మంది ఎంపికైకూడా కాల్ లెటర్స్ రాని అభ్యర్థులు ఉన్నారని, ధ్రువీకరణ పత్రాలు సమర్పించడంలో అనేక సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు.

మద్యాన్ని అరికట్టాలి: డీవైఎఫ్ఐ

కర్నూలు అర్బన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవ నవరాత్రులు పూర్తయ్యే వరకు జిల్లా వ్యాప్తంగా మద్యాన్ని అరికట్టాలని డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి రాజేంద్ర ప్రసాద్‌ను డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, సాయిఉదయ్‌లు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లర్లకు కారణ మయ్యే మద్యాన్ని నియంత్రించాలని కోరారు.

ఉల్లికి క్వింటానికి రూ.2వేలు చెల్లించండి

కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల ఉల్లి రైతుల కష్టాలను తీర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వైసీపీ జిల్లా అధ్య క్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి కోరారు. గురువారం కర్నూలు మార్కెట్ యార్డులో రైతులను ఆయన రాష్ట్ర రైతు విభాగం ఉపాధ్యక్షుడు భరత్ కుమార్‌రెడ్డి, తెర్నేకల్ సురేందర్ రెడ్డిలతో కలిసి పరామర్శించారు.

నేడు తెలుగు భాషా వేడుకలు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రప్రదేశ్ విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో, శుక్రవారం ఉదయం 10 గంటలకు జడ్పీ కార్యాలయంలోని ఎంపీపీ సమావేశ హాలులో 'తెలుగు భాషా దినోత్సవ సదస్సు' ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా రాయల సీమ విశ్వ విద్యాలయం వీసీ ఆచార్య వి. వెంకట బసవరావు, టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి జి. నాగమూని, ప్రముఖ బాలల సాహి త్యవేత్త, కథా రచయిత డాక్టర్ ఎం. హరికిషన్, ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్, న్యాయవాది డాక్టర్ ఆర్ ప్రవీణ్‌కుమార్, ఏపీఎస్పీ డీఎస్పీ ఎస్ మహ బూబ్ బాషా హాజరవుతారని వారు తెలిపారు.

డిపాజిట్ ఖాతాలపై అవగాహన అవసరం

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వినియోగదా రులు డిపాజిట్ ఖాతాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్బీఐ బ్రాంచ్ మేనేజర్ బి.లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం ప్రభుత్వ ఉన్న ఉర్దూ పాఠశాలలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ వర్క్‌షాపు జరిగింది. ఏపీజీబీ కింగ్ మార్కెట్ బ్రాంచ్ మేనేజన్ వి.జగన్‌మోహన్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ పి.శిరీష, అశోక్‌కుమార్, పుష్పరాజ్, పాఠశాల హెచ్‌ఎం ఎస్.తాహె రున్నీసా, తెలుగు ఉపాధ్యాయుడు సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కేవీఆర్ డిగ్రీ కళాశాలలో క్యాంటమ్ వ్యాలీ

కర్నూలు అర్బన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ కె.వెంకటరెడ్డి అధ్యక్షతన గురువారం అమరావతి క్యాంటమ్ వ్యాలీ హకథాన్ కార్యక్రమం జరిగింది. క్యాంటమ్ టెక్నాలజీలో కంప్యూటరింగ్, కమ్యూనికేషన్ గణిత శాస్త్రం, భౌతిక శాస్త్రం, మెటిరియల్స్, పెన్సిలింగ్ విభాగాల్లో విద్యార్థినులు ప్రాజెక్టును ప్రదర్శించారు. కార్యక్రమంలో అధ్యాపకురాలు పద్మావతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

చేయూతనివ్వడం అభినందనీయం

కర్నూలు అర్బన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మహమ్మదీయ వక్ఫ్ కాంప్లెక్స్ కేర్ కమిటీ ఆధ్వర్యంలో పేద ముస్లిం మహిళలకు చేయూత ఇవ్వడం అభినం దనీయమని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు నూరి మన్సూర్ ఆలీఖాన్ అన్నారు. గురువారం వక్ఫ్ కాంప్లెక్స్‌లో మంత్రి టీజీ భరత్ సహకారంతో తొమ్మిది మంది పేద ముస్లిం మైనార్టీ మహిళలకు రూ. 3000 ఆర్థిక సాయాన్ని అందించారు. నూరి మన్సూర్ ఆలీఖాన్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. కమిటీ అధ్యక్షు డు ఇబ్రహీం, సభ్యులు మునాఫ్, రమ్మీ, మహబూబ్, మైనార్టీ మహిళలు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ

కర్నూలు కల్చరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కొత్తబస్టాండు ఎదురుగా ఉన్న పురాతన ఎల్లమ్మ ఆలయ ప్రహరీ నిర్మాణానికి గురువారం రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ భూమి పూజ చేశారు. అనంతరం టీజీ వెంకటేష్ ఆలయాన్ని పరిశీలించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మాజీ ఎంపీ టీజీ వెంక టేశ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు ప్రతాపరెడ్డి, శివ, స్థానిక నాయకులు తెలుగు మహేష్, తిమ్మారెడ్డి, వీరప్ప, సాయినాథ్ తోపాటూ బజరంగ్‌దళ్ నాయకులు పాల్గొన్నారు.

టీటీడీ ఛైర్మన్‌ను కలిసిన తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): తిరుమల, తిరుపతి దేవస్థానం ఛైర్మన్ బీఆర్ నాయుడును టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి కలిశారు. గురువారం తిరుపతిలోని దేవస్థానం బోర్డు కార్యాలయంలో తిక్కారెడ్డి తనయుడు పాలకుర్తి దివాకర్‌తోపాటు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వాలి: సీపీఎం


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కల్లూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని 42వ వార్డు తిలక్‌నగర్ వాసులకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని సీపీఎం నగర కార్యదర్శి టి.రాముడు డిమాండ్ చేశారు. గురువారం తిలక్‌నగర్ పట్టాల సాధన సమితి ఆధ్వర్యంలో సి.చలపతి అధ్యక్షతన కల్లూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. టి.రాముడు గత 50 ఏళ్లుగా తిలక్‌నగర్‌లో నివాసం ఉంటున్న పేదలందరికీ జీఓ నెంబరు 30 ప్రకారం ఇంటి పట్టా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారు కె.ఆంజనేయులుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మురళి, కృష్ణ, వెంకటేశ్వర్లు, రమేష్, మల్లికార్జున పాల్గొన్నారు.

నేడు వేరుశనగ క్రయవిక్రయాల నిలివేత

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో శుక్రవారం వేరుశనగ క్రయవిక్రయాలు నిలుపుదల చేస్తున్నట్లు కార్యదర్శి ఎం.కల్పన తెలిపారు. ఇప్పటికీ వేరుశనగ అనధికార పాసింగ్ సమస్య పరిష్కారం కాలేదని, సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి మరోమారు వ్యాపారులు, హమాలీలు, కూలీలు, కమిషన్ ఏజెంట్లతో సమావేశం నిర్వహిస్తామన్నారు. వేరుశనగ తప్ప మిగతా పత్తి, ఆముదం, కంది ఇతర పంట ఉత్పత్తులకు యథావిధిగా క్రయవిక్రయాలు నిర్వహిస్తామని తెలిపారు.

ఉరుసుకు మంత్రికి ఆహ్వానం

హొళగుంద, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని షేక్షావలి, షాషావలి సాహెబ్‌ల 363వ ఉరుసుకు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను దర్గా ఈవో ఇమ్రాన్, టీడీపీనాయకుడు ఈడిగ గోవింద్ గౌడ్ గురువారం ఆహ్వానించారు. మంత్రి చేతుల మీదుగా పోస్టర్లను ఆవిష్కరించారు. రాజేంద్ర గౌడ్, వీరన్న గౌడ్,నిర్వాహకుడు షాపిర్ ఖాన్, బందప్ప, దిడ్డి నాగప్ప, డబ్బే ఎల్లప్ప, మల్లయ్య పాల్గొన్నారు.


మంత్రి ఫరూక్‌తో నిర్వాహకులు

రహదారులపై గుంతల పూడ్చివేత

మద్దికెర, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రహదారులపై పడిన గుంతలను పంచాయతీ సిబ్బంది గురువారం పూడ్చారు. ఇటీవల కురిసిన వర్షాలతో రహదారులపై గుంతలను గమనించిన సర్పంచ్ బండారు సుహాసిని ఆదేశాల మేరకు కార్యదర్శి శివకుమార్ గ్రావెల్ వేయించి పూడ్చివేయించారు. మేస్త్రీ లక్ష్మన్న ఉన్నారు.


గుంతను పూడ్చుతున్న సిబ్బంది

ఉద్యోగాన్ని ఎంచుకునే అవకాశం ఇవ్వాలి

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీలో అభ్యర్థులకు ఉన్నత శ్రేణి ఉద్యోగాన్ని ఎంచుకునే అవకాశం ఇవ్వాలని ఎస్‌టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎంసీ సుంకన్న డిమాండ్ చేశారు. గురువారం ఎస్‌టీయూ ప్రాంతీయ కార్యాలయంలో ఆదోని, కౌతాళం మండల నాయకుల సమావేశం చింతకుంట రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. మెగా డీఎస్సీలో వివిధ రకాల పోస్టులు ఉండటంతో దరఖాస్తు చేసే సమయంలో అభ్యర్థులు ప్రాధాన్య క్రమంలో ఆప్షన్లను ఇచ్చారన్నారు. అయితే అభ్యర్థి ఉన్నత శ్రేణి ఉద్యోగానికి అర్హత సాధించినప్పుడు ఇదివరకు ఇచ్చిన ప్రాధాన్యలో దిగువశ్రేణి ఉద్యోగం చూపడం ద్వారా అభ్యర్థి ఉన్నత శ్రేణి ఉద్యోగాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సత్తన్న, సుధాకర్ బాబు, షేక్షావలి, సూర్యుడు, ఆంజనేయా, లక్ష్మణ, రామ్మోహన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంసీ సుంకన్న

పంచాయతీలకు నూతన భవనాలు

● జడ్పీ సీఈవో నాసరరెడ్డి

దేవనకొండ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల క్రితం నూతనంగా ఏర్పాటైన జిల్లాలోని 36 గ్రామ పంచాయతీలకు నూతన భవనాలను నిర్మించనున్నట్లు జడ్పీ సీఈవో నాసరరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పాలకుర్తి గ్రామంలో పర్యటించారు. అనంతరం దేవనకొండ ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఐదు గ్రామాల్లో నూతన పంచాయతీ భవన నిర్మాణాలకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరించాలని, పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇళ్ల ముందు మురుగు పారకుండా ప్రజలు ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని ఇందుకు ప్రభుత్వం రూ.6 వేలు ఇస్తుందన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో గోపాల్ ఉన్నారు.


మాట్లాడుతున్న జడ్పీ సీఈవో నాసరరెడ్డి

సవరణలకు అవకాశమివ్వాలి

ఆదోని టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డులో సవరణకు అవకాశమివ్వాలని వీర శైవ జంగమ హక్కుల పోరాట సమితి సభ్యుడు కన్నె జగదీష్ కోరారు. గురువారం మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావస్తున్నా ప్రభుత్వ పథకాలు పొందలేని వారు అధిక సంఖ్యలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమితి సభ్యులు గాజుల చంద్రశేఖర్, విశ్వనాథ్ గౌడ్ పాల్గొన్నారు.

కొలువుదీరిన గణనాథులు

ఆదోని, పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. వీధుల్లో విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. ఆదోనిలో ఈ నెల 31న ఆదివారం చిన్నహరివాణం వద్ద ఉన్న ఎల్లెల్సీలో నిమజ్జనం చేయనుండగా, ఆలూరు, పత్తికొండలో శుక్రవారం చేయనున్నారు.
- ఆదోని, ఆదోని అగ్రికల్చర్, పత్తికొండ, ఆలూరు.


ఆదోని ఎల్‌బీ స్ట్రీట్‌లో వెంకటస్వామి అవతారంలో వినాయకుడు


ఆదోని విక్టోరియా పేటలో..


దేవనకొండలో


పత్తికొండ: ఎద్దుల బండిపై వినాయకుడు




ఆదోని : సంతపేటలో ఆదిశక్తి రూపంలో, రాయలసీమ మిల్ ప్రాంతంలో


తుగ్గలిలో పూజలు


పత్తికొండటౌన్: హోమం


బీటీనాయుడు, మీనాక్షినాయుడు, దేవేంద్రప్ప పూజలు


సీఐ రామలింగమయ్య డీఎస్పీ హేమలత..




ఆలూరు: కోయనగర్‌లో వైకుంఠం జ్యోతి, చిప్పగిరిలో ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి

భయం భయంగా..

హాలహర్వి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూళ్యం గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాల తరగతి గదుల పైకప్పు పెచ్చులూడుతుండటంతో విద్యార్థులు భయం భయంగా చదువుతున్నారు. ఇక్కడ 6 నుంచి 10వ తరగతి వరకు కన్నడ, తెలుగు మాధ్యమాల్లో బోధిస్తున్నారు. వెయ్యి మంది విద్యార్థులు ఉండగా మూడు గదులు పెచ్చులూడుతున్నాయి. అదనపు గదులు లేకపోడంతో పెచ్చులూడుతున్న గదిలోనే చదువుకుంటున్నారు. పెచ్చులూడితే ప్రమాదమని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.


గూళ్యంలో పెచ్చులూడిన గదిలో విద్యార్థులు

మరో బషీర్‌బాగ్ ఉద్యమం చేస్తాం

పత్తికొండ టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యుత్ స్మార్ట్ మీటర్లను అమరిస్తే మరో బషీర్‌బాగ్ ఉద్యమం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య, సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా పత్తికొండలో వామపక్ష నాయకులు అంబేడ్కర్ సర్కిల్ నుంచి ర్యాలీ నిర్వహించి, నాలుగు స్తంభాల కూడలికి చేరుకున్నారు. గతంలో ఇదే రోజు ఆగస్టు 28 2000 సంవత్సరంలో హైదరాబాద్ బషీరాబాగ్‌లో విద్యుత్ పోరాటం చేసి అసువులు బాసిన రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి చిత్రపటాలకు నివాళి అర్పించారు. నాటి సీఎం చంద్రబాబు ప్రభుత్వంలో పోలీసు కాల్పుల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని, వారి ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు. మోదీ, అదానీ అనుకూల విద్యుత్ సంస్కరణలను తీసుకొచ్చి, విద్యుత్ చార్జీలను పెంచడమేగాక స్మార్ట్‌మీటర్ల బిగింపుకు ప్రభుత్వం పూనుకోవడం సరి కాదన్నారు. రాజాసాహెచ్, కారుమంచి, రామాంజనేయులు, సురేంద్రకుమార్, సిద్ధు, గోపాల్, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రామచంద్రయ్య

యువ కవికి ప్రశంస

ఆలూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మరచేడు గ్రామానికి చెందిన యువకవి రాజశేఖర్‌కు ప్రశంసా పత్రం లభించింది. మంత్రాలయంలో కన్నడ సాహిత్య అకాడమీ నిర్వహించిన బహుభాషా కవి గోష్టిలో కవితా పఠనం చేసినందుకు గానూ కర్ణాటక బావుటా, జ్ఞాపికతో సత్కరించారు. పీఠాధిపతి సుబుదేంద్రతీర్థ, కన్నడ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మహేష్‌జోషి ఏపీ కన్నడ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు అంజన్‌కుమార్ ఉన్నారు.


ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న యువ కవి రాజశేఖర్

క్రీడల్లో పెద్ద హరివాణం జట్టు విజయం


ప్రతిభ చూపిన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ క్రీడా మైదానంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో పెద్ద హరివాణం జడ్పీ ఉన్నత పాఠశాల జట్టు ప్రతిభ చాటినట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీధర్, పీడీ రామన్న తెలిపారు. గురువారం కబడ్డీ, అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అభినందించారు. 100 మీటర్ల పరుగులో బాలుర విభాగంలో మల్లికార్జున రెండో స్థానంలో, 400 మీటర్లలో బి.మల్లికార్జున, 1500 మీటర్లలో జయసింహ, జావలింగ్ త్రోలో శివ ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ఉపాధ్యాయులు చిరంజీవి నాగేంద్ర, వీరలింగప్ప, ఎల్లప్ప, రవి ఉన్నారు.

సమాజ సేవకే అవోపా


నివాళి అర్పిస్తున్న సభ్యులు

ఆదోని టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సమాజానికి సేవ చేయడమే లక్ష్యంగా ఆవోపాను స్థాపించామని సంస్థ పట్టణ అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్తా తెలిపారు. గురువారం వ్యవస్థాపకుడు కృష్ణయ్య శెట్టి 41వ వర్ధంతి నిర్వహించారు. ఆర్యవైశ్య విద్యార్థులు 41 మందికి పుస్తకాలను పంపిణీ చేసారు. నాయకంటి రఘు, కోశాధికారి వెంకటేశ్వరులు, పరుచూరి రఘు పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళ మృతి

ఆలూరు రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మరచేడు గ్రామానికి చెందిన కురువ మంగమ్మ(45) పాముకాటుతో మృతిచెందింది. వివరాల మేరకు.. బుధవారం ఉదయం భర్త కురువ మహానందితో కలిసి పత్తి పొలంలో ఎరువులు వేస్తుండగా మంగమ్మను పాము కరచింది. ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యలో మంగమ్మ మృతిచెందింది. తెలుగు రైతు తాలూకా అధ్యక్షులు దేవేంద్రప్ప, కుమార్, వన్నూరప్ప, అంజి, గాదిలింగ సంతాపం తెలిపారు. మంగమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.


మంగమ్మ(ఫైల్)

నేడు మార్కెట్ వేలం

ఆస్పరి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మేజర్ గ్రామ పంచాయతీలో టమాటా కూరగాయల మార్కెట్ వేలాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ మూలింటి రాధమ్మ, కార్యదర్శి విజయ్‌రాజ్ తెలిపారు. పాటదారులు రూ.2 లక్షలు డిపాజిట్, రూ.5 లక్షలు సాల్వంచ సర్టిఫికెట్ పొంది వేలంలో పాల్గొనాలని సూచించారు.

నేడు విముక్తి దినం

పత్తికొండ టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం విజయవాడలో నిర్వహించనున్న సంచారజాతుల విముక్తి దినోత్సవాన్ని విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు గోవర్ధన్, నరేష్, బ్రహ్మాయ్య పిలుపునిచ్చారు. గురువారం శారదా వృద్ధాశ్రమంలో కరపత్రాలను విడుదల చేశారు. మల్లికార్జున, కర్నూలు చంద్ర, రామాంజనేయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

● సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్


ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్


నిమజ్జనానికి సూచనలు ఇస్తున్న సబ్ కలెక్టర్

ఆదోని రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ ఆదేశించారు. డివిజన్‌లో సీజనల్ వ్యాధులు ప్రబలి రోగులు అధిక సంఖ్యలో ఆదోని ఏరియా ఆసుపత్రికి వచ్చారన్న సమాచారం మేరకు సబ్ కలెక్టర్ గురువారం ఆసుపత్రిని తనిఖీ చేశారు. రోగుల వద్ద వెళ్లి వైద్యసేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇందిరా నగర్ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రోగులకు స్థానికంగా ఉన్న అర్బన్, పీహెచ్‌సీల్లో వైద్యసేవలు ఎందుకు అందించడం లేదని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం నుంచి అర్బన్, పీహెచ్‌సీల్లో వైద్యం అందించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సబ్ కలెక్టర్ వెంట సూపరింటెండెంట్ డాక్టర్ పద్మ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు చేయండి..

ఆదోని: పట్టణంలో ఆదివారం నిర్వహించ నున్న గణేష్ నిమజ్జనానికి పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ సూచించారు. గురువారం పట్టణంలో రహదారులను పరిశీలించారు. విగ్రహాల ఊరేగింపులో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. గుంతలకు ప్యాచ్ వర్క్‌లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కాలువ వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని, వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పనిచే యాలని సూచించారు. డీఎస్పీ హేమలత, తహసీల్దార్ రమేష్, మున్సిపల్ కమిషనర్ కృష్ణ, ఆర్‌అండ్‌బీ ఈఈ పద్మనాభరెడ్డి ఉన్నారు.

విద్యలో రాణించాలి

మద్దికెర, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణులు విద్య, అన్ని రంగాల్లో రాణించాలని ఆ సంఘం గౌరవాధ్యక్షుడు ఆర్ఎంపీ కానుగుల రామాంజనేయులు, అధ్యక్షుడు వీరేంద్ర అన్నారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థు లను సన్మానించి నగదు అందజేశారు. ఎర్రిస్వామి, రామ్‌నగర్ సోము, మంగళి శేఖర్, నాగభూషణం ఉన్నారు.


విద్యార్థికి నగదు అందజేస్తున్న వీరేంద్ర

శ్మశానికి స్థలం ఇవ్వాలి

తుగ్గలి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జొన్నగిరి గ్రామంలో హిందూ శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని టీడీపీ నాయకులు లక్ష్మణస్వామి, సంగాల కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ రవికి వినతి పత్రం అందించారు. గ్రామంలో 12వేల జనాభా ఉందని, దహన సంస్కారాకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఇప్పటి వరకు చెరువులో ఒక శవంపై మరో శవాన్ని పూడుస్తున్నామని పూడ్చి ఇబ్బందులు పడుతున్నామన్నారు. వర్షం వస్తే చెరువు దహనసంస్కారాకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. జయరాం, అంజి తదితరులు ఉన్నారు.


వినతి పత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

రసాభాసగా సమావేశం

వెల్దుర్తి టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మేజర్ గ్రామ పంచాయతీ సర్వసభ్య సమావేశం గురువారం రసాభాసగా సాగింది. సర్పంచ్ ముత్యాల శైలజ అధ్యక్షత వహించారు. సర్పంచ్‌పై ఉప సర్పంచ్ శ్వేత తీవ్ర ఆరోపణలు చేయడంతో సమావేశం వేడెక్కింది. రోడ్లు, కాల్వల నిర్మాణాలపై సర్పంచ్‌ను, అధికారులను ఉప సర్పంచ్ నిలదీశారు. 40 రోజుల్లోనే రూ.92 లక్షలను ఎలా ఖర్చు పెట్టారని అధికారులను నిలదీశారు. వార్డు సభ్యుల సంతకాలను పోర్జరీ చేశారంటూ ఆరోపించారు. సర్పంచ్ మాట్లాడుతూ గత ఈవో రూ.4లక్షల తప్పుడు బిల్లులను పెట్టారని, ఇప్పుడు తనకు తెలియకుండా రూ.2లక్షల బిల్లులు పెట్టారని వాటిని ఆమోదించేది లేదన్నారు. ఏవో లక్ష్మీనారాయణ, జడ్పీటీసీ సుంకన్న, ఎంపీటీసీ బొమ్మన రవిరెడ్డి ఎల్గొనానరు. సమావేశంలో గొడవ చోటుచేసుకోవడంతో ఏఎస్ఐ నరసింహారెడ్డి బందోబస్తు నిర్వహించారు.


నివేదిక చదువుతున్న అధికారి

ఎరువులు తరలిస్తే లైసెన్సు రద్దు


తనిఖీ చేస్తున్న తహసీల్దార్ రమాదేవి, ఏవో జీర గణేష్

మంత్రాలయం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర నుంచి మాధవరం గుండా యూరియా, ఇతర ఎరువులు తరలిస్తే ఆయా దుకాణాలను, లైసెన్సులు రద్దు చేసి సీజ్ చేస్తామని తహసీల్దార్ రమాదేవి, ఏవో జీర గణేష్ హెచ్చరించారు. గురువారం కర్ణాటక సరిహద్దులో ఉన్న మాధవరంలోని పంచముఖి ట్రేడర్స్‌లో రికార్డులను, గోడౌన్‌లోని ఎరువుల నిల్వలను అకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూరియా కొరత వల్ల రైతులు ఇబ్బందులు పడుతుంటే.. కొంత మంది అధిక రేట్లకు కర్ణాటకకు అమ్ముతున్నారని, ఇలాంటివి మానుకోకపోతే డీలర్ల లైసెన్సులు రద్దు చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిర్ణీతమైన ధరలకే రైతులకు ఎరువులు అందజేయాలని, ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించి అధిక రేట్లకు అమ్మితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీలో ఏఈవో తిరుమల్ రెడ్డి, వీహెచ్‌వోలు విజయ్, రాజేష్, గురురాజ్‌గౌడు పాల్గొన్నారు.

టీడీపీ కోసిగి మండల అధ్యక్షుడిగా పల్లెపాడు రామిరెడ్డి

కోసిగి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావం నుంచి టీడీపీలో క్రియాశీలకంగా పని చేసిన పల్లెపాడు రామిరెడ్డిని మూడోసారి కోసిగి మండల టీడీపీ అధ్యక్షులుగా టీడీపీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్, టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి సహకారంతో టీడీపీ మండల అధ్యక్షునిగా ఎంపిక చేశారనీ, ఈ సందర్భంగా వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్లబండ సింగిల్ విండో చైర్మన్ నాడిగేని అయ్యన్న, జ్ఞానేష్, వక్రాణి వెంకటేశ్ పాల్గొన్నారు.

టోల్ ప్లాజ్ దగ్గర వాగ్వాదం

నందవరం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంత్రాలయం రోడ్డులోని ధర్మపురం టోల్ ప్లాజా దగ్గర టీడీపి నాయకులకు టోల్‌ప్లాజా సిబ్బందికి వాగ్వివాదం చోటుచేసుకోని గొడవకు దారితీసింది. ఈ సంఘటన సంబంధించిన వీడియో కాస్తా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. టీడీపి నాయకుడు శ్రీనివాస్ రెడ్డి మంత్రాలయం నుంచి ఎమ్మిగనూరుకు వస్తుండగా ధర్మపురం టోల్ ప్లాజా దగ్గర టోల్ ప్లాజా సిబ్బందికి టీడీపీ నాయకులు, అనుచరులకు టోల్ ఫీజు విషయంలో వాగ్వివాదం చోటు చేసుకోని ఘర్షణకు దారి తీసింది. ఈ ఘర్షణలో టీడీపీ నాయకుడు, కార్యకర్తలు టోల్ ప్లాజా సిబ్బందిపై దాడి చేశారు. దీంతో ఇరువరి మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. అక్కడ ఉన్న స్థానికులు ఇరువురికీ సర్దిచెప్పి శాంతింపజేశారు. ఈ సంఘటనను స్థానికులు కొంత మంది వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. కాగా నందవరం ఎస్ఐ కేశవ్ ను వివరణ కోరగా ఫిర్యాదు అందలేదన్నారు.

'సీఎం చంద్రబాబువి మోసపూరిత ప్రకటనలు'

నందవరం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబువి మోసపూరితమైన ప్రకటనలు చేసి ప్రజలను మభ్యపెడుతున్నారని వైసీపీ రాష్ట్ర మేదవుల ఫోరం సంయుక్త కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి, రాష్ట్ర బీసీసెల్ సంయుక్త కార్యదర్శి విరుపాక్షిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గురుజాలలో మాజీ ఎంపీ, నియోజకవర్గ ఇన్‌చార్జి బుట్టారేణుక ఆదేశాల మేరకు మండలపార్టీ కన్వీనర్ శివారెడ్డి గౌడ్ ఆధ్వర్యంలో 'బాబు షూరిటీ - మోసం గ్యారెంటీ' నినాదంతో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. అధికారంలోకి వచ్చాకా ఇచ్చిన హామీలు విమర్శిస్తున్నడని వారు ఆరోపించారు. కార్యక్రమంలో నరసింహరెడ్డి, రాజాశరత్, రమేష్ అతావుల్లా, నాగప్ప పాల్గొన్నారు.

హైటెన్షన్ విద్యుత్ వైరు తగిలి ఎద్దుల మృతి

కౌతాళం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో బుధవారం వినాయక చవితి రోజున హైటెన్షన్ విద్యుత్ వైర్లు తగిలి రెండు ఎద్దులు మృతి చెందగా ఒక వ్యక్తి గాయపడి చికిత్స పొందుతున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఉరుకుంద పంచాయతీలో మజరా గ్రామమైన తిమ్మాపురం గ్రామానికి చెందిన సుంకర అంజనేయకు చెందిన ఎద్దులను కుమారుడు రమేష్ ఎద్దుల బండి కట్టుకుని ఉరుకుంద గ్రామం నుంచి తిమ్మాపురంకు బండిలో ఒక రేకుల డబ్బాను తీసుకునిపోతుండగా గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద 33కేవి విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. ఇది గమనించని రమేష్ ఎద్దులను ముందుకు పోతుండగా ఇనుప డబ్బాకు విద్యుత్ తీగలు తగిలి విద్యుత్ షాక్‌కు గురై ఎద్దులు అక్కడిక్కడే మృతి చెందాయి. ఎద్దుల బండిపై ఉన్న రమేష్ విద్యుత్ షాక్‌కు గురై గాయపడ్డాడు. స్థానికులు రమేష్‌ను చికిత్స కోసం ఆదోనికి తరలించారు. ప్రస్తుతం ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతి చెందిన ఎద్దుల విలువ దాదాపు రూ.2లక్షలకు పైగా ఉంటుందని అంజినయ్య తెలిపారు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని కోరారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామ ప్రజలు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నందవరం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నందవరానికి చెందిన ఆంజినేయులు(37) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ కేశవ తెలిపారు. సోమవారం ఆంజినేయులు పశువులకు గడ్డి కోసేందుకు తన పోలానికి వెళ్లాడు. అక్కడ గట్టు దగ్గర గడ్డి కోస్తూ ఉండగా పాము కరిచింది. దీంతో వెంటనే మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడు టీడీపీ కార్యకర్త కావడంతో టీడీపీ జిల్లా ఉపాధ్యాక్షుడు దేశాయి మాదవరావు, సహకార సంఘం మండల అధ్యక్షుడు దర్మాపురం గోపాల్, మండల పార్టీ కన్వీనర్ కాశీంవలీ, డీవి రాముడు మృతునికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఘనంగా ముగ్గుల పోటీలు

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని షరాఫ్ బజారులో మినీ వినాయక యువక మండలి అధ్వర్యంలో ఘనంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు విశ్వనాథ్ మాట్లాడుతూ మినీ వినాయక యువక మండలి అధ్వర్యంలో వినాయకుడిని విగ్రహ ప్రతిష్ట చేసి ఈ సంవత్సరంతో నేటికి 25 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా వివిధ రకాల పోటీలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు యు యు రామకృష్ణ, సచిన్, పింటూ, విజయ్ పాల్గొన్నారు.

కొలువుదీరిన గణనాథుడు

● ప్రారంభమైన గణేశ్ నవరాత్రులు
● పూజల్లో పాల్గొన్న ప్రముఖులు
● యువత కోలాహలం


ఎమ్మిగనూరులో వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేస్తున్న ఎమ్మెల్యే బీవీ


తేరుబజారులో పూజలు నిర్వహించిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి


ఎమ్మిగనూరులో ఉత్సవాల్లో యువత


రాళ్లదొడ్డి గ్రామంలో పూజల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు

ఎమ్మిగనూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరులో వినాయకచవితి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని 34వార్డుల్లో దాదాపు 350 వినాయక విగ్రాహాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. పట్టణంలోని శ్రీ నీలకంటేశ్వర స్వామి ఆలయంలో, తేరుబజారులో వినాయక పూజల్లో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి తేరుబజారు, మార్కెట్ కమిటీతో పాటు ఆయా ప్రాంతాల్లో వెలసిన వినాయక మండపాల్లో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు చేశారు. అలాగే వైసీపీ నాయకులు రుద్రగౌడ్, కుమార్ గౌడ్‌లు కోర్టు వీధిలోని శక్తి వినాయకుడు, తేరుబజారులో ఏర్పాటు చేసిన మండపంల్లో గణనాధున్ని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. అలాగే ఎమ్మెల్యే కొండవీటి ప్రాంతం, శివసర్కిల్, లక్ష్మీపేట, ఎంఎస్ నగర్ తదితర ప్రాంతాల్లోని వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లయ్య, నిర్వాహకులు మాచాని శివకుమార్, మామిడి మల్లికార్జున, మల్లి, లలిత్, చింటు, మంజు, రవి, వెంకోబు, శ్రీకాంత్, శ్రీనివాస రెడ్డి, ఆప్కో శ్రీధర్‌పాల్గొన్నారు.


మంత్రాలయంలో ప్రతిష్ఠించిన యుద్ధ వీర గణపతి

● **భక్తులను ఆకట్టుకుంటున్న గణనాధులు:**, కొండవీటి ప్రాంతంలో వింజామర ఈకలు, అయ్యప్పమాల పూసలు, రుద్రాక్షలతో ఏర్పాటు స్వామి విగ్రహం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే ఎంఎస్ నగర్‌లో వరసిద్ధి వినాయక మండలి సభ్యుల ఆధ్వర్యంలో 50కిలోల తామరపువ్వు విత్తనాలతో ఏర్పాటుచేసిన వినాయకవిగ్రహం ఎంతగానో ఆకట్టుకుంటోంది. అలాగే కోర్టురోడ్డులో శక్తి వినాయకమండలి ఆధ్వర్యంలో రూ. 60లక్షలు విలువ చేసే 54 కేజీల వెండి కవచం, వెండి బిస్కెట్లు, వెండి చెంబులు, వెండిగ్లాసులతో ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు శ్యామ్ తెలిపారు. ఈ వినాయక విగ్రహాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

● **మంత్రాలయం**

లంబోదరునికి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం వినాయకచవితి పురస్కరించుకుని మట్టి గణపతిని బంగారు పల్లకిలో ఏర్పాటు చేసి గ్రామ పురవీధుల గుండా ఊరేగించి అనంతరం పూర్ణబోధ పూజా మందిరంలోప్రత్యేక పూజలు చేసి హారతులు ఇచ్చి భక్తులను ఆశీర్వదించారు. వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

●నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయంలో రాఘవేంద్రపురం, ఎల్లమ్మ గుడి వద్ద యుద్ధ వీర గుర్రంపై స్వారీ చేస్తున్న గణనాథుడు భక్తులను, గ్రామస్థులను ఆకట్టుకుంటుంది. అదే విధంగా మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో వెలసిన తిరుమల వెంకటేశ్వరస్వామి అలంకరణలో గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మాధవరం, మాలపల్లి, సుంకేశ్వరి, రచ్చుమర్రి, చెట్నహల్లి, చిలకలడోన, సూగూరు, బూదూరు గ్రామాల్లో వాడవాడలా గణపయ్యలు పూజలందుకుంటున్నారు. కార్యక్రమంలో ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. అదే విధంగా టీటీడీ బోర్డు మాజీ సభ్యులు సీతారామిరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు ప్రదీప్‌రెడ్డి, గురెడ్డి భీమిరెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య గణనాథులకు పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కోసిగి: మండల కేంద్రమైన కోసిగితో పాటు అన్ని గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు బుధవారం వినాయక మిత్ర మండలి సభ్యులు, ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కోసిగిలోని కోసిగయ్య గుడి (ఆంజనేయస్వామి దేవాలయంలో) ఆంజనేయస్వామి ఆకారంలో ఉన్న గణనాథున్ని ఆలయ అర్చకుడు విష్ణుస్వామి ప్రసాద్ స్వామి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు

ఎమ్మిగనూరు రూరల్: ఎమ్మిగనూరు మండల పరిధిలోని కడివెళ్ల, కందనాతి, సిరాలదొడ్డి, మసీదుపురం, మాస్‌మాన్‌దొడ్డి, గుడికల్లు, కడిమెట్ల, రాళ్లదొడ్డి, ఎర్రకోట, కె.తిమ్మాపురం, కలుగొట్ల, వెంకటగిరి, బనవాసి, కొటేకల్లుతో పాటు ఆయా గ్రామంలో వినాయక చవితి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. రాళ్లదొడ్డి గ్రామంలో టీడీపీ యువనేత రాళ్లదొడ్డి మురళికృష్ణారెడ్డి వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులను తీర్చుకున్నారు. అలాగే కడిమెట్ల గ్రామంలో పీఏసీసీ చైర్మన్ కడిమెట్ల విరుపాక్షిరెడ్డి వినాయక చవితి వేడుకల్లో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెద్దకడబూరు: మండల కేంద్రమైన పెద్దకడబూరుతో పాటు మండల పరిధిలోని దొడ్డిమేకల, హెచ్.మురవణి, కంబళదిన్నె, జాలవాడి, కల్లుకుంట, మేక డోన, ముచ్చగిరి, నౌలేకల్లు, రాగిమాన్‌దొడ్డి తదితర గ్రామాల్లో వినాయక చవితి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. పెద్దకడబూరులో టీడీపీ రైతు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డితో పాటు పీఏసీ చైర్మన్ మీసేవా ఆంజనేయులు, టీడీపీ నాయకులు, ప్రజలు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నందవరం:మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రజలు, నాయకులు బుధ, గురువారాలు ఘనంగా వినాయక చవితి వేడుకలు జరుపుకున్నారు. . ఎస్ఐ కేశవ ఆధ్వర్యంలో గ్రామాల్లో ఏలాంటి అవాంచనీయ సంఘటనలు చేయకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.



కోసిగిలో ఏర్పాటు చేసిన ముంబై లాల్ గజపతి వినాయకుడు


గోనెగండ్ల: మండల పరిధిలోని గాజులదిన్నె గ్రామంలో వినాయక చవితి సందర్భంగా వినాయకుడిని ప్రతిష్ఠించి కురువ సంఘం, తెలుగుయువత నాయకుల ఆధ్వర్యంలో కురువ కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రామకృష ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు రోజుల పాటు పూజాకార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి భజన కార్యక్రమం చేపట్టారు.

కౌతాళం: మండలంలో బుధవారం గణపతి పండుగ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. కౌతాళంతో పాటు ఎరిగేరి, ఉరుకుంద, హల్వి, బదినేహాల్ గ్రామాలతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో గణనాధులు వివిధ రూపాలలో కొలువై భక్తులచే పూజలు అందుకున్నారు. కౌతాళంలో 3వ రోజు సోమవారం ఎల్ఎల్‌సీ కాలువలో నిమజ్జన కార్యక్రమును నిర్వహిస్తారు.


పెదకడబూరులో


గోనెగండ్లలో


కౌతాళంలో


నందవరంలో..

కార్యకర్తలందరికీ న్యాయం


అభినందిస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ విజయానికి కష్టపడిన ప్రతికార్యకర్తకు న్యాయం చేస్తానని మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి ఎన్ రాఘవేంద్ర రెడ్డి అన్నారు. గురువారం మాధవరం తన నివాసంలో ఏర్పాటుచేసిన నూతనంగా టీడీపీ మండల ఆధ్యక్షులుగా ఎన్నికైన సింగరాజనహాళ్లి గ్రామానికి చెందిన ఎస్ఎం గోపాల్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. అదే విధంగా రాఘవేంద్ర రెడ్డితో పాట మంచాల సింగిల్ విండో అధ్యక్షులు, టీడీపీ నాయకులు రామకృష్ణారెడ్డి,మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి, యువనాయకులు రాకేష్ రెడ్డి, రాజారెడ్డిని శాలువ, పూలమాలలతో సత్కారించారు. ఈకార్యక్రమంలో రాఘన్న, సింగిల్‌విండో డైరెక్టర్ చాపలనాగేష్, నాగరాజు, మల్లేష్ పాల్గొన్నారు.

శివయ్యకు వెండి కిరీటం సమర్పణ


వెండి కిరీటాన్ని అందజేస్తున్న కడిమెట్ల పీఏసీసీ చైర్మన్ కడిమెట్ల విరుపాక్షిరెడ్డి

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని ఎర్రకోట గ్రామంలో వెలసిన మహాలింగేశ్వరస్వామికి కడిమెట్ల పీఏసీసీ చైర్మన్ కడిమెట్ల చిన్నమల్లారెడ్డి తనయుడు విరుపాక్షిరెడ్డి 1.5 కేజీల వెండి కిరీటాన్ని బహూకరించారు. బుధవారం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పూజారి శివకు రూ. 1.30లక్షలు విలువ చేసే 1.5 కేజీల వెండి కిరీటాన్ని విరాళంగా అందజేశారు. విరాళం అందజేసిన విరుపాక్షిరెడ్డి కుటుంబ సభ్యులకు ఆలయ పూజారులు ఫల, పుష్ప, మంత్రాక్షింతలిచ్చి ఆశీర్వదించారు.

ఆలయ జీర్ణోద్ధరణకు విరాళం

కౌతాళం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి వారికి ఆలయ జీర్ణోద్ధరణకు గురుజాల గ్రామ వాస్తవ్యులు భీముడు కుటుంబ సభ్యులు రూ.60,311ల నగదును, ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆలయ కార్యాలయంలో అందజేసినట్లు తెలిపారు. దాతలకు ఆలయ అర్చకులు స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి లడ్డు ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉపప్రధాన అర్చకుడు మహదేవప్ప స్వామి ఉన్నారు.

వైభవంగా ప్రహ్లాదరాయల చెక్క రథోత్సవం


చెక్క రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): శ్రీ మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు చెక్క రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. రాఘవేంద్ర స్వామి సజీవసమాధి పొందిన గురువారం పంచమి శుభ దినం పురస్కరించుకుని శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో చెక్క రథాన్ని వివిధ పుష్పాలతో చూడ ముచ్చటగా అలంకరించి, వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల మధ్య వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్టించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజల మంటపంలో ఊంజలసేవలో స్వామివారిని ఊగించారు. వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో మంత్రాలయం మార్మోగింది.

మాధవరంలో బైకుల చోరీ

మంత్రాలయం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన ఈడిగ వీరేష్, చాకలి వీరేష్‌కు చెందిన 2 మోటార్‌సైకిళ్లు గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుని వెళ్లారు. ఈసంఘటన ఈనెల 25న సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు అప్రమత్తమై సీసీ కెమెరాల ద్వారా దర్యాప్తు చేస్తున్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

మంత్రాలయం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం సర్కిల్ పరిధిలోని ఆయా గ్రామాల్లో జరుపుకునే గణేష్ ఉత్సవాల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రామాంజులు, ఎస్సై విజయ్ కుమార్‌లు హెచ్చరించారు. గురువారం రాత్రి మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో గణేష్ ఉత్సవ కమిటి సభ్యులతో పాటు, సమావేశం ఏర్పాటు చేశారు.

తేలుకాటుతో బాలిక మృతి

కోసిగి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సజ్జలగుడ్డం గ్రామానికి చెందిన బాలిక జేకే మల్లేశ్వరి (17) తేలుకాటుకు మృతి చెందింది. ఈనెల 25న రాత్రి తేలు కాటుకు గురి కావడంతో కోసిగి ఆసుపత్రికి తీసుకువచ్చి చూపించుకున్నారు. ఆ రోజు స్టాఫ్ నర్స్ రెండు ఇంజక్షన్లు వేశారని కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులు బాలికను ఇంటికి తీసుకెళ్లారు. ఈనెల 26న ఉదయం పరిస్థితి విషమించడంతో బాలికను కోసిగి ఆసుపత్రికి తీసుకొచ్చారు. మాత్రలు ఇచ్చి పంపించారు. ఈనెల 27న మళ్లీ ఆసుపత్రికి తీసుకువచ్చారు. విధుల్లో ఉన్న డాక్టర్ రజిత మెరుగైన వైద్యం కోసం ఆదోనికి రెఫర్ చేశారు. అయితే ఆదోనిలో పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. బాలిక మృతికి స్టాఫ్ నర్సు, వైద్యులే కారణమని వారు ముందుగానే ఆదోనికి వెళ్లాలని సూచించలేదని తండ్రి వీరనగాప్ప, కుటుంబ సభ్యులు ఆరోపించారు. డాక్టర్ రజితను వివరణ కోరగా.. తేలు కుట్టిన రోజునే ఆసుపత్రికి రాగా ఆదోనికి వెళ్లాలని తమ సిబ్బంది సూచించారని, అయితే బాలిక కుటుంబ సభ్యులు ఇంటికి వెళ్లిపోయారని చెప్పారు. ఈనెల 26న మరోసారి వచ్చి మాత్రలు తీసుకెళ్లారని తెలిపారు. పరిస్థితి విషమించి ఈనెల 27న బాలిక చనిపోయింది.

చిరు వ్యాపారుల సమస్యకు శాశ్వత పరిష్కారం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆయా రహదారులు, కూడళ్లలో ఉన్న చిరువ్యాపారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, చిరువ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిరువ్యాపారులు ఇబ్బంది పడకుండ తగిన జాగ్రతలు తీసుకుంటామన్నారు. అందుకు మున్సిపల్ అధికారులు తగిన పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమీషనర్ గంగిరెడ్డి, డీఈలు నీరజ, నాయక్, ఏఈలు మధన్ పాల్గొన్నారు.

కొరత సృష్టిస్తున్న దుకాణాలపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : యూరియా కొరత సృష్టించి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న ఫర్టిలైజర్స్ దుకాణాలను సీజ్ చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి సత్యన్న డిమాండ్ చేశారు. ఈ సవదర్భంగా గురువారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఫర్టిలైజర్ దుకాణాలు యూరియా కొరత సృష్టించి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వ్యవసాయ అధికారులు కేవలం ఫర్టిలైజర్ దుకాణాల మీద మాత్రమే దాడులు నిర్వహిస్తున్నారని అన్నారు. కానీ దుకాణా యాజమాన్యాలు మరోకచోట గోడౌన్లలో యూరియాను నిల్వ ఉంచుతున్నారని వాటిపై తణిఖిలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాలరాజు, బాబు, నరసన్న పాల్గొన్నారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

కోసిగి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని 9వ వార్డు దుర్గానగర్‌లో ఈ నెల 21న ఇంటికి తాళం వేసి ఉన్న ఇంటి కిటికిలోపలకి దూరి ఇంట్లో ఉన్న రెండు బంగారు నక్లెస్‌లు (3 తులాలు), ఒక బంగారు రింగ్, రెండు జతల పిల్లల బంగారు కమ్మలు, 50 తులాల వెండి ఎత్తుకెళ్లారని రైల్వే ఉద్యోగి తుప్పద భీమయ్య ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ హనుమంతరెడ్డి దర్యాప్తులో దొంగతనం చేసిన బాధితుడి సమీప బంధువు అని విచారణలో తేలింది. రైల్వే ఉద్యోగి భీమయ్య సమీప బంధువు ఆదోని మండలం అనువాలు గ్రామానికి చెందిన ఈరన్న అనే వ్యక్తి రైల్వే ఉద్యోగి ఇంట్లో బీరువాను పగులకొట్టి 5తులాల బంగారం, 50 తులాల వెండి, రూ.10వేల నగదును దొంగతనం చేసినట్లు తెలిపారు .దొంగ నుంచి 5తులాల బంగారం, 50 తులాల వెండి స్వాధీనం చేసుకుని అనువాలు ఈరన్నపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని సీఐ మంజునాథ్, ఎస్ఐ హనుమంతరెడ్డి, ట్రైనీ ఎస్ఐ ఈశ్వర్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నజీర్, శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు లక్షీనారాయణ, బాలకృష్ణ, నాగేష్, పాల్గొన్నారు.